www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల : 5.00

Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి :2 | సంచిక : 26 | బుధవారం | 10 జూలై 2024




చివరి టీ20 మనదే

8 లో..



## ఏదీ మెగా డీఎస్సీ?

- లక్షలాది మంది అభ్యర్థుల ఆక్రందన కాంగ్రెస్ సర్కారుకు వినపడటం లేదా?
- మీరు కొలువుదీరితే సరిపోతుందా.. యువతకు కొలువులు అక్కర్లేదా?
- ఉస్మానియా విద్యార్థులంటే ఎందుకంత కోపం
- ఫిరాయింపుల మీద ఉన్న దృష్టి నిరుద్యోగులపై లేకపోవడం సిగ్గుచేటు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

న్యూఢిల్లీ, హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:


డీఎస్సీ వాయిదా వేయాలంటూ, పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై అక్రమ కేసులు, నిర్బంధం, అరెస్ట్ చేయటాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ అని చెప్పి ఇప్పుడు వారిని దగా చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలి కేబిట్‌లోనే 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ అని ఇచ్చిన మాట తొమ్మిది

మిగతా 2 లో

# జాతీయ రహదారుల నిర్మాణానికి
# పూర్తి సహకారం

## ఆటంకాలు ఉంటే తొలగించి సహకరిస్తాం

- ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి సహకరించండి
- హైదరాబాద్, మన్నెగూడ రహదారి పనులను ప్రారంభించాలి
- ఎన్‌హెచ్ఏఐ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:

తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి తమ పూర్తి సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రహదారుల నిర్మాణానికి ఏవైనా ఆటంకాలు ఉంటే వాటిని తొలగిస్తామని స్పష్టం చేశారు. భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏ) ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఆయన నివాసంలో మంగళవారం సమావేశమయ్యారు. సమావేశంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎన్‌హెచ్ఏఐ (ప్రాజెక్ట్స్) మెంబర్ అనిల్ చౌదరి, ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందన, సీఎం కార్యదర్శి షానవాజ్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎన్.హెచ్.ఏ.ఐ చేపడుతున్న రహదారుల నిర్మాణంలో భూ సేకరణతో పాటు తలెత్తున్న పలు ఇబ్బందులను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. స్పందించిన ముఖ్యమంత్రి ఆయా సమస్యల పరిష్కారానికి బుధవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. రహదారులు నిర్మాణం జరిగే జిల్లాల కలెక్టర్లు, అటవీ శాఖ అధికారులు భేటీలో పాల్గొంటారని

మిగతా 2 లో



## భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతా

- పదేళ్లలో 40 వేల కి.మీ. రైల్వే లైన్లను ఎలక్ట్రిఫికేషన్ చేశాం
- పదేళ్లలో జరిగిన అభివృద్ధి కేవలం ట్రైలర్ మాత్రమే
- ఆత్మవిశ్వాసంతో దేశం ముందుకు నడుస్తోంది
- మాస్కోలో ఎన్నారైల సదస్సులో ప్రధాని మోడీ

మాస్కో:

రాబోయే ఐదేళ్ల పదవీకాలంలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారుస్తామని ప్రధాని మోదీ అన్నారు. గత పదేళ్లలో భారత్ ఎంతగానో పురోభివృద్ధి సాధించిందని అననారు. ఇటీవలే మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశానని, మూడు రెట్ల వేగంతో పని చేయాలని నిర్ణయించుకున్నానని అన్నారు. మంగళవారం రష్యా రాజధాని మాస్కోలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఇక్కడికి తాను ఒక్కడినే రాలేదని, 140 కోట్ల మంది భారతీయుల ప్రేమను వెంట తీసుకొని వచ్చానని వ్యాఖ్యానించారు. పదేళ్లలో జరిగిన అభివృద్ధి జస్ట్ ట్రైలర్ మాత్రమే అన్నారు దేశం మారుతోందని ప్రపంచమంతా గర్విస్తోందన్నారు. విదేశాల్లో ఉంటున్న భారతీయులు దేశాన్ని చూసి గర్విస్తున్నారని చెప్పారు. మహిళలను లక్షాధికారులను చేస్తున్నామన్నారు. భారత్‌లో పేదల కోసం 3 కోట్ల ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. భారత్ జీ20 సదస్సును సమర్థవంతం గా నిర్వహించిందన్నారు. కోవిడ్ సంక్షోభాన్ని సమర్థవం తంగా ఎదుర్కొన్నామని చెప్పారు. భారత్ ను ప్రపంచం లోనే బలమైన ఆర్థిక వ్యవస్థగా మార్చామన్నారు. ప్రపం చంలోనే

మిగతా 2 లో



## కేఆర్ఎంబీ పరిధిలోకి కృష్ణా ప్రాజెక్టులు

- ఏపీ పిటిషన్‌పై సుప్రీం ధర్మాసనం విచారణ
- కేంద్రం తరపున నివేదిక దాఖలు చేయాలని ఆదేశం

2 లో..

## సొంత జిల్లాలో సీఎం రేవంత్ పర్యటన

- వివిధ అభివృద్ధి పనుకుల పలు శంకుస్థాపనలు
- కలెక్టరేట్‌లో మొక్కనాటిన ముఖ్యమంత్రి

2 లో..




## సీఎం రేవంత్‌తో క్రికెటర్ సిరాజ్ భేటీ

## 25 వేల గ్రామ సమాఖ్య సంఘాలకు కోటి సాయం

- కోటీశ్వరులను చేయాలన్న సీఎం సంకల్పం
- సీజన్‌లో 20.02 కోట్ల మొక్కలు నాటే లక్ష్యం
- సీజనల్ వ్యాధులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు
- జిల్లా కలెక్టర్లతో సీఎస్ శాంతికుమారి సమీక్ష

3 లో..






## హాస్టల్ చట్నీలో ఎలుక ప్రత్యక్షం

సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన దృశ్యం

2 లో..




## నకిలీ కంపెనీలు సృష్టించి మోసం


అమెరికాలో నలుగురు తెలుగువాళ్ల అరెస్ట్

2 లో..

## కలుషితాహారంతో విద్యార్థులకు అస్వస్థత



3 లో..



## అంగరంగవైభవంగా ఎల్లమ్మ కల్యాణోత్సవం

ప్రత్యేక అలంకరణలో అమ్మవారి దర్శనం
పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు

3 లో..



# జాతీయ రహదారుల నిర్మాణానికి పూర్తి సహకారం

(మొదటిపేజీ తరువాయి)

ఆయా సమస్యలపై చర్చించి అక్కడే సమస్యలను పరిష్కరించుకుందామని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్, మన్నెగూడ రహదారి పనులను వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు సూచించారు. కాంట్రాక్టు సంస్థతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు వెంటనే మొదలు పెట్టాలని వారికి సూచించారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలన్నారు. హైదరాబాద్-విజయవాడ మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవే మంజూరు కోసం ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలను ముఖ్యమంత్రి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణానికి సహకరించాలని ముఖ్యమంత్రి ఎన్.హెచ్.ఏ.ఐ అధికారులను కోరారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన భారత్ మాల పథకంలో ఆర్ఆర్ఆర్ ను చేపట్టాలని ప్రధానమంత్రి మోదీకి ఇటీవల విజ్ఞప్తి చేసిన విషయాన్ని వారికి గుర్తు చేశారు. ఔటర్ రింగ్ రోడ్, రీజనల్ రింగ్ రోడ్ మధ్యలో 12 రేడియల్ రోడ్లు వస్తాయని సీఎం తెలిపారు. వాటి మధ్య పలు క్లస్టర్లు, శాటిలైట్ టౌన్ షిప్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణకు తీర ప్రాంతం లేనందున డ్రై పోర్ట్ ఏర్పాటు చేయనున్నామని, ఇందు కోసం బందర్ పోర్టును అనుసంధానించేలా హై స్పీడ్ ఎక్స్ ప్రెస్ వే నిర్మాణం చేపట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ -కల్వకుర్తి జాతీయ రహదారి పనులు మొదలు పెట్టాలన్నారు. వ్యూహాత్మకంగా కీలకమైన ఈ రహదారితో తిరుపతికి 70 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని సీఎం వివరించారు. మహారాష్ట్ర, కర్ణాటక తో పాటు హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే వారికి సౌకర్యంగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో రహదారుల నిర్మాణం పైన ప్రతి వారం తనకు నివేదిక ఇవ్వాలని సీఎంవో కార్యదర్శి షానవాజ్ ఖాసీం ను ముఖ్యమంత్రి ఆదేశించారు.

# సొంత జిల్లాలో సీఎం రేవంత్ పర్యటన

- వివిధ అభివృద్ధి పనుకుల పలు శంకుస్థాపనలు
- కలెక్టరేట్‌లో మొక్కనాటిన ముఖ్యమంత్రి



**మహబూబ్‌నగర్, ప్రజానావ:** వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మహబూబ్ నగర్ కలెక్టరేట్ ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొక్కలు నాటారు. జిల్లాలో పలు అభివృద్ధి పనులకు సిఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. జిల్లాలో మొత్తం 396.09 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగా రూ.353. 66 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎంవిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.10 కోట్లతో బాలికల హాస్టల్ నిర్మాణం, దేవరకద్రలో రూ.6.10కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం, మహబూబ్ నగర్ రూరల్ లో రూ.3.25 కోట్లతో కెజివిబి భవన నిర్మాణం, గండీడ్‌లో రూ.6.20 కోట్లతో కెజివిబి భవన నిర్మాణం, పాలమూరు యూని వర్సిటీలో రూ.13.44 కోట్లతో టిపి, అకాడా మిక్ బ్లాక్, గ్యాలరీ పనులు, మహబూబ్ నగర్ మున్సిపాలిటీలో రూ.37.87 కోట్లతో సిసి రోడ్లు, స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం, మహబూబ్ నగర్ మున్సిపాలిటీలో రూ.276.80 కోట్లతో ఎస్‌టిపి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పాలమూరు యూనివర్సిటీలో రూ.42.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, చిన్నారెడ్డి, ఎంపి మల్లు రవి, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం మహబూబ్‌నగర్ కలెక్టర్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. 2025 డిసెంబర్‌లోపు కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. గ్రీన్ ఛానెల్ ద్వారా నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతి నెలా ప్రాజెక్టు పనుల్లో పురోగతిపై సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు.

# సీఎం రేవంత్‌తో క్రికెటర్ సిరాజ్ భేటీ

## టీమిండియా జెర్సీ బహుకరణ

**హైదరాబాద్, ప్రజానావ:** టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత భారత క్రికెటర్లకు వారి వారి సొంత నగరాల్లో ఘనం గా స్వాగతం లభిస్తుంది. తాజాగా టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ హైదరాబాద్ చేరుకున్న తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ని కలిశారు. టీ20 వరల్డ్ కప్ గెలిచినందుకు సిరాజ్ ను సీఎం రేవంత్ రెడ్డి శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా సిరాజ్ టీమిండియా జెర్సీని సీఎం రేవంత్ రెడ్డికి బహుకరించారు. ఈ కార్యక్రమంలో క్రికెటర్ అజారుద్దీన్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వెస్టిండీస్, అమెరికా వేదికలుగా ఇటీవలే జరిగిన టీ20 వరల్డ్ కప్ ను భారత జట్టు గెలుచుకుంది. భారత జట్టుకు ఎంపికైనా 15 మంది స్క్వాడ్ లో సిరాజ్ ఒక సభ్యుడు. లీగ్ మ్యాచ్ ల వరకు ఆడిన సిరాజ్,.. సూపర్ 8 మ్యాచ్ లకు బెంచ్ కు పరిమితమయ్యాడు. ఆడిన మూడు మ్యాచ్ ల్లో ఒక వికెట్ పడగొట్టాడు. పొదుపుగా బౌలింగ్ చేసి ఆకట్టుకున్నాడు. సిరాజ్ ప్రస్తుతం జింబాబ్వే పర్యటనకు దూరంగా ఉన్నాడు. వరల్డ్ కప్ తర్వాత రెస్ట్ ఇచ్చిన ఆటగాళ్లలో సిరాజ్ ఒకరు. ఆగస్టులో సొంతగడ్డపై శ్రీలంకతో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు సిరాజ్ అందుబాటులో ఉండనున్నాడు. అంతకముందు సిరాజ్ భారత ఆటగాళ్లతో పాటు ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన సంగతి తెలిసిందే.

# భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతా

(మొదటిపేజీ తరువాయి)



అతిపెద్ద హెల్త్ ఇన్సురెన్స్ స్కీంను అమలు చేస్తున్నామని తెలిపారు. 2024కు ముందు దేశం నిరాశతో ఉండేది.. ఇపుడు ఆత్మవిశ్వాసంతో నిండి ఉందన్నారు. డిజిటల్ పేమెంట్స్ తో కొత్త రికార్డులు సృష్టిస్తున్నామని చెప్పారు మోదీ. ప్రపంచంలోనే ఎత్తైన ప్రదేశంలో రైల్వే బ్రిడ్జి నిర్మించామని.. పదేళ్లలో 40 వేల కి.మీ. రైల్వే లైన్లను ఎలక్ట్రిఫికేషన్ చేశామని, ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మించామని పేర్కొన్నారు. దేశ అభివృద్ధిలో140 కోట్ల మంది భారతీయుల పాత్ర ఉందన్నారు. టీ20 వరల్డ్ కప్ గెలిచి దేశం సంబురాలు చేసుకుంది.. చివరి వరకు టీమిండియా పోరాడింది. ఒటమి ఒప్పుకోని వారినే విజయం వరిస్తుందన్నారు. భారత్ రష్యా మధ్య సంబంధాలు ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటాయన్నారు. 10 సంవత్సరాలలో సెమీకండక్టర్ల నుంచి ఎలక్ట్రానిక్ తయారీ, గ్రీన్ హైడ్రోజన్ నుంచి ఎలక్ట్రిక్ వాహనాల వరకు ప్రపంచ స్థాయి మౌలిక సదు-పాయాల వరకు మరింత వేగంగా అభివృద్ధి చెందబోతున్నామని చెప్పారు. సవాళ్లను స్వీకరంచడంలో భారత్ ముందంజలో ఉంటుందన్నారు. ఏ దేశానికి సాధ్యం కాని విధంగా చంద్రయాన్ ప్రయోగం చేశాం. చంద్రుని దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా గుర్తింపు పొందాం. డిజిటల్ లావాదేవీల్లో ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా ఉన్నాం. స్టార్టప్‌ల్లో ప్రపంచంలోనే మూడో స్థానానికి చేరుకున్నాం. 2014లో వందల్లో ఉన్న స్టార్టప్‌లు నేడు లక్షల్లోకి చేరాయి. భారత్ రికార్డు స్థాయిలో పేటెంట్లను సాధిస్తోంది. ప్రపంచంలో అతిపెద్ద ఆరోగ్యబీమా వ్యవస్థ భారత్‌లో ఉంది. భారత్‌ను ప్రపంచంలో మూడో ఆర్థికవ్యవస్థగా నిలబెడతాను. మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే పటిష్ఠమైంది అని వివిధ రంగాల్లో భారత్ సాధిస్తోన్న విజయాలను ప్రస్తావించారు. భారత్ ఘనతను ప్రపంచం గుర్తించకతప్పని పరిస్థితి తెచ్చామని వ్యాఖ్యానించారు. భారత యువతే దేశ నిజమైన ఆస్తి అని, ఆత్మవిశ్వాసం దేశానికి అతిపెద్ద ఆయుధమని అన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం వేళ.. భారత విద్యార్థులు చిక్కుకుపోతే, వారిని కాపాడటంలో పుతిన్ సహకరించారని మోదీ గుర్తుచేశారు. ఈసందర్భంగా ఆయనతో పాటు రష్యా ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. భారత్-రష్యా నమ్మకమైన మిత్రులు. పరస్పర విశ్వాసం, గౌరవం ఆధారంగా ఈ స్నేహం కొనసాగుతోంది. రష్యాలో చలికాలంలో ఉష్ణోగ్రతలు మైనస్‌ల్లోకి పడిపోయినా, మన బంధం మాత్రం ఎప్పుడూ ప్లస్‌లోనే ఉంటుంది. మన స్నేహాన్ని ఆహ్లాదంగా ఉంచుతుంది. ఇప్పటివరకు నేను ఆరుసార్లు రష్యాలో పర్యటించాను. పుతిన్‌తో 17 సార్లు భేటీ అయ్యాను అని తెలిపారు. ఇకపోతే మోదీ, పుతిన్ 22వ భారత్%-%రష్యా వార్షిక సదస్సులో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, ఇంధన, రక్షణ రంగాల్లో సహకారానికి ఉన్న అవకాశాలపై చర్చలు జరపనున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం రష్యాకి చేరుకున్నారు. రష్యా రాజధాని మాస్కోలో ప్రధాని విమానం ల్యాండ్ కాగానే అక్కడి అధికారులు మోదీకి రెడ్ కార్పెట్ వేసి సాదర స్వాగతం తెలిపారు. దాండియా, గర్బా నృత్యాలతో రష్యా అధికారులు ఆయనకు వెల్‌కం చెప్పారు. ఈ పర్యటనలో భారత్, రష్యాల మధ్య పలు ముఖ్యమైన ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉంది. ఈ సమావేశం ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉండే అవకాశం ఉంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నుండి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో పాటు జెలెన్స్‌కీ నుండి నాటో వరకు ప్రతి ఒక్కరూ ఈ సమావేశంపై దృష్టి పెట్టారు. 2025 నాటికి భారత్, రష్యాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. రష్యా 2025 నాటికి 50 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య పలు అంశాలపై చర్చలు జరగనున్నట్లు తెలుస్తోంది. భారతదేశంలో యాంటీ ట్యాంక్ షెల్స్‌ను తయారీ పరిశ్రమకు సంబంధించి ఒప్పందం చేసుకునే అవకాశం ఉంది. మ్యాంగో ఆర్మర్-పియర్సింగ్ ట్యాంక్ రౌండ్ ఫ్యాక్టరీ డీల్, సైనిక లాజిస్టిక్స్ ఒప్పందంపై చర్చ, ప్రాంతీయ, ప్రపంచ భద్రతకు ప్రాధాన్యత, ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై చర్చ, రక్షణ, చమురు, గ్యాస్‌కు సంబంధించిన అంశాలపై ఇద్దరు నేతలు చర్చించనున్నారు.

# ఏదీ మెగా డీఎస్సీ?

(మొదటిపేజీ తరువాయి)



నెలలు కావస్తోన్న ఏమైందంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేటీఆర్ నిలదీశారు. లక్షలాది మంది డీఎస్సీ అభ్యర్థుల ఆక్రందన కాంగ్రెస్ సర్కారుకు వినపడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి మీరు కొలువుదీరితే సరిపోతుందా? యువతకు కొలువులు అక్కర్లేదా ? అని కాంగ్రెస్ సర్కార్‌ను కడిగి పారేశారు. ఉస్మానియా విద్యార్థులన్నా.. అక్కడ నిరసనలు తెలుపుతున్న అభ్యర్థులన్నా సీఎంకు ఎందుకంతా కోపమో చెప్పాలన్నారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉస్మానియా విద్యార్థులు అడ్డమీద కూలీల్లాంటి వారని తిన్నది అరిగేదాకా అరిచే బీరు బిర్యానీ బ్యాచ్ అని బద్నాం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. సిద్ధాంతం, ఆలోచన లేని ఆవారా టీమ్ అని వారి అవహేళన చేసిన మీరే%ొ%అదే విద్యార్థులను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చారన్న సంగతి మర్చిపోవద్దన్నారు.

### ఇదేనా ప్రజా పాలన అంటే..?

అధికారంలోకి రాగానే నేడు అదే ఉస్మానియా యూనివర్సిటీని రణరంగంగా మార్చి.. డీఎస్సీ అభ్యర్థులపై పోలీసులను ప్రయోగించి అణచివేస్తున్నారని మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కూడా కాలరాస్తున్నారని వందల మందిని అన్యాయంగా అరెస్టు చేసి అక్రమ కేసులు పెడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేనా ప్రజా పాలన అంటే అని ప్రశ్నించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం దేశ సరిహద్దుల్లో ఉందా? అక్కడికి అన్ని బలగాలను తెచ్చి ఎందుకంతా నిర్బంధాన్ని విధిస్తున్నారో అర్థం కావటం లేదన్నారు. మళ్లీ ఉస్మానియాలో ఉద్యమం నాటి పరిస్థితులను రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకొస్తుందంటూ కేటీఆర్ ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ చేతకానితనాన్ని ప్రశ్నించడమే వాళ్లు చేసిన నేరమా? ప్రచారంలో ఇచ్చిన హామీలు నెరవేర్చమని అడగడమే పాపమా? అని రేవంత్ సర్కార్ ను కేటీఆర్ నిలదీశారు.

### ఎందుకింత మొండి వైఖరి?

ముఖ్యమంత్రిగా మీకు మోకా వస్తే.. డీఎస్సీ అభ్యర్థులకు ఇంత ధోకా చేస్తారని ఊహించలేదన్నారు. ఇప్పటికే మెగా డీఎస్సీ అని.. నిరుద్యోగ యువతను నిలువునా మోసం చేశారు. ఇప్పుడు ప్రిపరేషన్‌కు కూడా టైమ్ ఇవ్వకుండా.. వారి భవిష్యత్తుతో చెలగాటం ఆడటం ఎంత వరకు కరెక్ట్ అన్నారు. పరీక్షలు వాయిదా వేయాలంటూ డీఎస్సీ అభ్యర్థులు కోరుతుంటే వారి డిమాండ్‌ను పరిశీలించటంలో ఎందుకింత మొండి వైఖరో చెప్పాలన్నారు. న్యాయమైన డిమాండ్లను ఆడబిడ్డలు అడిగినంత మాత్రాన అర్ధరాత్రి వరకు అక్రమంగా నిర్బంధిస్తారా? ఇదేనా మహిళలంటే.. ముఖ్యమంత్రికి ఉన్న గౌరవం అని కేటీఆర్ ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే నోటిఫికేషన్లు.. అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇస్తామన్నారు. ఇప్పుడు కనీసం సీఎం అపాయింట్మెంట్ కూడా నిరుద్యోగులకు ఎందుకు ఇవ్వడం లేదు. నిరుద్యోగులంతా ఈ ప్రభుత్వం వైఖరిని గమనించాలని కోరారు. పార్టీ ఫిరాయింపుల మీద ఉన్న దృష్టి.. పోరుబాట పట్టిన నిరుద్యోగులపై లేకపోవడంపై కాంగ్రెస్ సిగ్గుపడాలన్నారు కేటీఆర్.

### సోకాల్డ్ మేధావులెక్కడ?

ఇన్నాళ్లు కాంగ్రెస్ సర్కార్‌ను భుజాన మోసిన సోకాల్డ్ మేధావులు ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించే గొంతులు ఎందుకు మూగబోయాయో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. ఇప్పటికైనా డీఎస్సీ పరీక్షల వాయిదా, పోస్టుల పెంపు డిమాండ్లు నెరవేర్చాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ జెండా వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఇలాగే మొండి వైఖరి ప్రదర్శిస్తే నిరుద్యోగులతో కలిసి మరో ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.

# హాస్టల్ చట్నీలో ఎలుక

## సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన దృశ్యం

**కరీంనగర్, ప్రజానావ:** హాస్టళ్లలో ఇటీవలి కాలంలో వెలుగులోకి వస్తున్న ఘటనలు చూస్తోంటే హాస్టల్ అన్న ఆలోచన వస్తేనే భయపడేలా పరిస్థితి తయారయ్యింది. హాస్టల్ ఫుడ్ లో పురుగులు రావటం అది తిని పిల్లలు ఆసుపత్రి పాలవుతున్న ఘటనలు వరుసగా జరగటమే ఇందుకు కారణం. తాజాగా సుల్తాన్పూర్ లోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్ హాస్టల్‌లో చట్నీ సాంబార్‌లో ఎలుకలు ప్రత్యక్షమవటం కలకలం రేపింది. చట్నీతో ఎలుక ఈత కొడుతూ కనిపించటంతో స్టూడెంట్స్ అవాక్కయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ గా మారింది. వారం రోజుల క్రితమే ఫుడ్ క్రాంట్రాక్టర్ మార్చాలని ఆందోళనకు దిగారు విద్యార్థులు. కాంట్రాక్టర్ ను మారుస్తామని ప్రిన్సిపాల్ హామీ ఇచ్చినప్పటికీ తీరు మారకపోవడంతో స్టూడెంట్స్ ఆందోళన చెందుతున్నారు. కాగా, ఈ ఘటనపై కళాశాల ప్రిన్సిపాల్ స్పందించారు. సిబ్బంది నిర్లక్ష్యమే ఈ ఘటనకు కారణమని, చట్నీ పాత్రపై మూత పెట్టకపోవడంతో అందులో ఎలుక పడిందని వివరణ ఇచ్చారు. దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని అన్నారు.

# కేఆర్ఎంబీ పరిధిలోకి కృష్ణా ప్రాజెక్టులు

**న్యూఢిల్లీ, జులై:** కృష్ణానది పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకువచ్చే అంశంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి విద్యుత్ ఉత్పత్తి, ఇతర అవసరాలకు అనుమతులు లేకుండా నీటిని వినియోగిస్తున్న విషయంపై ఆంధ్రప్రదేశ్ గతంలో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఒఖా, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసి నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈ విషయంపై కేంద్రం నుంచి తగిన ఆదేశాలు తీసుకుని తాజాగా అఫిడవిట్ దాఖలు చేస్తామని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటియా కోర్టుకు తెలిపారు. కృష్ణా పరివాహక ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి ఇవ్వడం తమకు సమ్మతమేనని ఆంధ్రప్రదేశ్ గతంలోనే చెప్పింది. ఇదే అంశంపై విముఖత వ్యక్తం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో రెండు ప్రభుత్వాల అభిప్రాయాలకు అనుగుణంగా కేంద్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఇరు రాష్ట్రాల న్యాయవాదులు అన్నారు. అయితే నోటిఫికేషన్ జారీ చేయడానికి కొన్ని సాంకేతిక కారణాలు ఉన్నాయని కేంద్రం (కేఆర్ఎంబీ) తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ తెలిపారు. ఈ విషయంలో కేంద్రం నుంచి తగిన సూచనలు, ఆదేశాలు తీసుకోవాల్సి ఉందని కోర్టుకు వివరించారు. ఈ వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం తదుపరి విచారణను ఆగస్టు 20కి వాయిదా వేసింది. ఆలోపు అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది.

# నకిలీ కంపెనీలు సృష్టించి మోసం

## అమెరికాలో నలుగురు తెలుగువాళ్ల అరెస్ట్


**వాషింగ్టన్, జులై :** అమెరికాలో నలుగురు తెలుగువాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. నకిలీ కంపెనీలు సృష్టించి కొంతమందితో బలవంతంగా పని చేయించుకుంటున్నట్లు గుర్తించారు. ఇప్పటికే ఇద్దరు కంపెనీ మోసాల్లో ఇద్దరు భారతీయ సంతతికి చెందిన అమెరికన్లకు జైలు శిక్ష వేశారు. తాజాగా ఇప్పుడీ ఘటన చోటు చేసుకుంది. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల్లో దాదాపు 100 మందికి పైగా నకిలీ కంపెనీల్లో పనిచేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. పోలీసుల సోదాల్లో ఒకే ఇంట్లో 15 మందిని గుర్తించడం గమనార్హం. ప్రిన్స్‌టన్ పోలీసుల వివరాల ప్రకారం.. గిన్స్‌బర్గ్ లేన్‌లోని ఓ ఇంట్లో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం అందింది. 2024 మార్చి 13న ప్రిన్స్‌టన్ పోలీసు సీఐడీ విభాగం సంతోష్ కట్కూరి ఇంట్లో సోదాలు జరిపింది. మొత్తం 15 మంది యువతులతో ఆయన భార్య ద్వారక పని చేయిస్తున్నట్లు తేలింది. వీరంతా బలవంతంగా పని చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. వారినుంచి ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు, ప్రింటర్లు సహా పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత జరిపిన దర్యాప్తులో ప్రిన్స్‌టన్, మెలిసా, మెకెన్నీ ప్రాంతాల్లోనూ బాధితులను గుర్తించారు. ఎలక్ట్రానిక్స్ పరికరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన పోలీసులు.. అక్రమంగా కంపెనీలు నెలకొల్పి కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు తేల్చారు. సంతోష్, ద్వారకతో పాటు చందన్ దాసిరెడ్డి, అనిల్ మాలె సైతం వీరికి సహకరించినట్లు తెలిసింది. ఈ నలుగురిపైనా అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. గిన్స్‌బర్గ్ ప్రాంతంలో పనిచేసే ఓ శ్రామికుడు అపార్ట్‌మెంట్‌లో చాలామంది పని చేస్తుండడం గమనించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వటంతో విషయం వెలుగులోకి వచ్చింది. అక్కడ పనిచేసే వారిని ప్రశ్నించగా.. డాలస్ కేంద్రంగా పనిచేస్తున్న ఓ భారత ఏజెన్సీలో నలుగురు వ్యక్తులు తమతో బలవంతంగా పని చేయించుకుంటున్నారని వెల్లడించారు.



## అంగరంగవైభవంగా ఎల్లమ్మ కల్యాణోత్సవం

- ప్రత్యేక అలంకరణలో అమ్మవారి దర్శనం
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు

**హైదరాబాద్, ప్రజానావ:** హైదరాబాద్ బల్కంపేట్ ఎల్లమ్మ కల్యాణం వైభవంగా జరిగింది. అమ్మవారి కల్యాణానికి ఉదయం నుంచే భక్తులు భారీగా తరలివచ్చారు. ఎల్లమ్మ కల్యాణానికి ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారి దర్శనమిచ్చారు. ప్రభుత్వం తరపున మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పట్టువస్త్రాలు సమర్పించారు. మేయర్ గద్వాల విజయలక్ష్మీ కూడా హాజరయ్యారు. ఎల్లమ్మ తల్లి దేవస్థానం అమ్మవారి గర్భాలయాన్ని ఆలయ అధికారులు ప్రత్యేకంగా అలకంరించారు. అమ్మవారి మూలవిరాట్ కు బంగారు చీరతో అలంకరణ చేశారు. ఎల్లమ్మ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారికి 27 చీరలు,స్వామి వారికి 11 పంచెలతో . రంగు రంగుల పూలతో అమ్మవారి ప్రధాన ఆలయం, పరిసరాలను తీర్చిదిద్దారు. అమ్మవారి మూలవిరాట్‌కు బంగారు చీరతో అలంకరణ చేశారు. ఆలయంలో ఎల్లమ్మ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమచ్చారు. రంగురంగు పూలతో అమ్మవారి ప్రధాన ఆలయం, పరిసరాలను తీర్చిదిద్దారు సిబ్బంది. భక్తుల కోసం క్యూలైన్లు, ÷పఎఖ ఎంట్రీ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు క్యూ కట్టారు. లక్షల్లో భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. మూడ్రోజుల కల్యాణ మహోత్సవంలో భాగంగా మొదటి రోజు పెళ్లి కల్యాణ మహోత్సవం జరిగింది. బుధవారం ఉదయం 5 గంటలకు నాదస్వర మంగళ వాయిద్యములు, అభిషేకం నిర్వహిస్తారు. దేవతాపూజలు, అగ్రి ప్రతిష్ఠ గణపతిహోమం, మహా శాంతి హోమం, బలిహరణం, పూర్ణాహుతి ఉంటా యి. అలాగే రాత్రి ఆరు గంటల నుంచి అమ్మవారి రథోత్సవం జరుగనుంది. దీంతో కళ్యాణ ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలకు వచ్చే భక్తులకు పార్కింగ్ ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.



## హత్రాస్ ఘటనపై సుప్రీం కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ:** హత్రాస్ తొక్కిసలాట ఘటనలో సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై కీలక నిర్ణయం తీసుకున్నది. పిటిషన్‌ను విచారణ కోసం సోమవారం లిస్ట్ చేయాలని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. ఈ నెల 2న హత్రాస్ లో భోలే బాబా నిర్వహించిన సత్సంగంలో తొక్కిసలాట జరిగి 121 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఐదుగురు సభ్యుల కమిటీని నియమించాలని పిటిషనర్ డిమాండ్ చేశారు. ఘటనపై నివేదిక తయారు చేసి బాధ్యులపై చర్యలు తీసుకునేలా యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషన్లో కోరారు. న్యాయవాది విశాల్ తివారీ మట్లాడుతూ.. హత్రాస్ తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశామన్నారు. జాబితా చేసేందుకు కోర్టు సిద్ధంగా ఉందని.. త్వరలోనే విచారణ జరుగుతుందని పేర్కొన్నారు. తాము ఓ కమిటీ ఏర్పాటుకు డిమాండ్ చేశామని.. రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలోని నిపుణుల కమిటీ నివేదిక ఇవ్వాల్సి ఉందన్నారు. ఇదిలా ఉండగా.. తొక్కిసలాట ఘటనలో ఇప్పటి వరకు 121 మంది మృతి చెందారు. ఇందులో మృతుల్లో మహిళలు, పిల్లలే ఎక్కువ ఉన్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, హర్యానా సహా పలు రాష్ట్రాల నుంచి ప్రజలు ఈ సత్సంగానికి జనం తరలివచ్చారు. వాహనాల సంఖ్య మూడు కిలోమీటర్ల మేర విస్తరించి ఉండడంతో రద్దీని అర్థం చేసుకోవచ్చు. సత్సంగం ముగిసిన తర్వాత భోలే బాబా పాదధూళిని తీసుకునేందుకు జనం ఎగబడిన సమయంలో తొక్కిసలాట చోటు చేసుకున్నది. భద్రత కల్పించడంలో నిర్వాహకులు, పోలీసుల వైఫల్యం చెందారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరో వైపు ఘటనపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు పలువురిని అరెస్టు చేశారు.

## లోయలోకి దూసుకెళ్లిన బస్సు

- ఇద్దరు చిన్నారుల మృతి
- 64 మందికి గాయాలు

**నాసిక్ :** మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ఓ బస్సు అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. మరో 64 మందికి గా యాలయ్యాయి. హుటాహుటిన ఘటనా ప్రాంతాని కి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. మృతదేహా లను పోస్టుమార్టానికి పంపించారు. గుజరాత్ సరి హద్దుల్లోని డాంగ్ జిల్లా పరిధిలోగల సత్పురా ఘాట్ దగ్గర ఈ ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న వాహనాన్ని బస్సు డ్రైవర్ ఓవర్ టేక్ చేయడం ప్రమాదానికి కారణమైంది. ఓవర్ టేక్ చేసిన ప్రాంతంలోనే మూలమలుపు ఉండటంతో ఆలస్యం గా గమనించిన బస్సు డ్రైవర్ అదుపు చేయలేక పోయాడు. దాంతో బస్సు ఎదురుగా ఉన్న లోయ లోకి దూసుకెళ్లింది. బస్సులోని ఓ ప్రయాణికుడి జర్నీని తన మొబైల్ రికార్డు చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. దాంతో బస్సు లోయలోకి దూసుకెళ్తున్న దృశ్యాలు, ప్రయాణికుల ఆర్తనాదాలు ఆ మెబైల్‌లో రికార్డయ్యాయి.

ఈ వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 70 మంది ప్రయాణికులు ఉన్నారు. కాగా ఈ ప్రమాదం ఆదివారం చోటుచేసుకుంది.

## 25 వేల గ్రామ సమాఖ్య సంఘాలకు కోటి సాయం

- కోటీశ్వరులను చేయాలన్న సీఎం సంకల్పం
- సీజన్‌లో 20.02 కోట్ల మొక్కలు నాటే లక్ష్యం
- సీజనల్ వ్యాధులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు
- జిల్లా కలెక్టర్లతో సీఎస్ శాంతికుమారి సమీక్ష



**హైదరాబాద్, ప్రజానావ:** రానున్న ఐదేళ్ళలో రాష్ట్రంలోని 25 వేల గ్రామ సమైఖ్య సంఘాలకు కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. వనమహోత్సవం, మహిళాశక్తి, ప్రజాపాలన సహాయ కేంద్రాలు, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, వ్యవసాయ సంబంధిత అంశాలు, ధరణి, ఉద్యోగుల బదిలీలు, గృహనిర్మాణం తదితర అంశాలపై నేడు జిల్లా కలెక్టర్లతో సి.ఎస్ శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్రంలో ప్రస్తుత సీజన్ లో 20.02 కోట్ల మొక్కలు నాటెందుకు లక్ష్యంగా నిర్ణయించామని, దీనిలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికే వరంగల్ లో వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. రాష్ట్రంలో సరిపడ మొక్కలు అందుబాటులో ఉన్నాయని, ఇటీవలి కాలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున జిల్లాల వారీగా కేటాయించిన లక్ష్యాల మేరకు నాణ్యమైన మొక్కలను నాటేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్పష్టం చేశారు. నాటిన ప్రతీ మొక్క ను జియోటాగింగ్ చేయడంతో పాటు వాటి మనుగడకు చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామాల్లో 100 శాతం ఖాళీ స్థలాలు కవర్ అయ్యే విధంగా మొక్కలు నాటేందుకు జిల్లాలోని సీనియర్ అధికారులు దత్తత తీసుకోవాలని సూచించారు. ఎ÷%-%లాంటేషన్ సైట్లను జిల్లా అధికారులు, క్షేత్ర స్థాయి అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలోని 25 వేల గ్రామ సమైఖ్య సంఘాలకు కోటి రూపాయల ఆర్థిక సహాయం రాష్ట్రంలో రానున్న ఐదేళ్ళలో రాష్ట్రంలోని 25 వేల గ్రామ సమైఖ్య సంఘాలకు కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయడం ద్వారా రాష్ట్రంలోని స్వయం సహాయక మహిళలను కోటీశ్వరులను చేయాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక బృందాలలో ఇప్పటికీ చేరని మహిళలందందరినీ చేర్పించాలని, రానున్న ఐదేళ్ళలో స్వయం సహాయక మహిళలను కోటీశ్వరులు చేయాలన్న లక్ష్య సాధనకు త్వరలోనే ఒక విధాన నిర్ణయం పత్రాన్ని విడుదల చేయనున్నట్టు సి.ఎస్ తెలిపారు. మహిళా సంఘాల ద్వారా పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ ల తయారీ పనులను సకాలం లో పూర్తి చేసి ప్రశంసలు అందుకున్నారని అభినందించారు. రెండో సెట్ యూనిఫామ్ ల పనులను కూడా త్వరలోనే పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని జిల్లాల్లో ఇందిరా క్యాంటీన్ ల ఏర్పాటు ను త్వరితగతిన ప్రారంభమయ్యేలా చొరవ చూపించాలి. ఇంకా అసంపూర్తిగా గా ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను రెండు వారాల్లో పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. గత సంవత్సరం, ఈ నాటికి, 44 లక్షల ఎకరాల్లో నాట్లు పడగా ప్రస్తుత వానా కాలం సీజన్ లో ఇప్పటికే 50 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేశారని అన్నారు. అన్ని మండలాల్లో సరిపడా యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నాయని, వాటి పంపిణీని జిల్లా కలెక్టర్లు ప్రతీ రోజూ పర్యవేక్షించాలని సి.ఎస్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 9 ఉమ్మడి జిల్లాల్లో రైతు భరోసా సదస్సులను నిర్వహిస్తున్నామని, ఈ సదస్సులకు ఆయా జిల్లాలోని రైతులు, రైతు ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత వర్షాకాల సీజన్ లో అతిసార, డెంగ్యూ, మలేరియా, చికన్ గున్యా లాంటి వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు సురక్షిత మార్గాలపై ప్రజలను చైతన్య పర్చడంతోపాటు, ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్, ఇంటింటి ఆరోగ్య సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. ఇప్పటికీ, ఈ వ్యాధుల ఆనవాలు కన్పించిన జిల్లాల్లో మరింత అప్రమత్తతో ఉండాలన్నారు. అన్ని జిల్లా కేంద్రాలలో 24 / 7 పనిచేసే హెల్ప్ లైన్లను ఏర్పాటు చేయడంతో పాటు రాపిడ్ రెస్పాన్స్ టీమ్ లను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో భూ సంబంధిత వివాదాలకు సంబంధించి అందిన ధరణి ఫిర్యాదుల పరిష్కారానికి మరింత శ్రద్ధ చూపించాలని జిల్లా కలెక్టర్లను సి.ఎస్ శాంతి కుమారి ఆదేశించారు. ఇప్పటికే, గత రెండున్నరయేళ్లుగా 57 వేల దరఖాస్తులకు పైగా జిల్లాల్లో పరిష్కరించారని, పెండిరగ్ లో ఉన్న దరఖాస్తులన్నింటినీ పరిష్కరించ డానికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారంలో గణనీయమైన పురోగతి ఉందని ప్రశంసించారు. మిగిలినవి రాబోయే 10 రోజుల్లో పరిష్కరించాలన్నారు. ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా మరింత సమర్ధవంతమైన సేవలను ప్రజలకు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాల న్నారు. ఉద్యోగుల బదిలీల పక్రియను ఈనెల 20 వ తేదీ లోగా ఎట్టిపరిస్థితిలోనూ పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. ఇప్పటికే, శాఖల వారీగా ఖాళీల వివరాలను ప్రకటించడం జరిగిందని, సంబంధిత ఫారాలను పొందిన అనంతరం ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం బదిలీల పక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని తెలియచేసారు. రాష్ట్రంలో దాదాపు 49 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినందున, ఒక్కో పాఠశాల ఏర్పాటుకు కనీసం 20 ఎకరాల ప్రభుత్వ భూమిని వెంటనే సేకరించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పై సమీక్షిస్తూ, కేంద్ర గ్రాంటును వెంటనే పొందేందుకుగాను ఇప్పటికే పూర్తయి, ఇళ్లను పొందిన లబ్దిదారుల వివరాలను లోడ్ చేయాలన్నారు. సమీక్షలో రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్, ప్రణాళికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పీసీసీఎఫ్ ఆర్.ఎం. డోబ్రియాల్, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, పంచాయత్ రాజ్, గ్రావిరిణాభివృద్ధి శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాష్, సెర్ప్ సిఈఓ దివ్య, మున్సిపల్ శాఖ డైరెక్టర్ గౌతమ్, లా సెక్రటరీ తిరుపతి తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ క్రింది అంశాల వారీగా సి.ఎస్. సమీక్షా సమావేశం నిర్వహించారు.

## నూతన ఒరవడి సృష్టిస్తున్న నారా లోకేష్ 'ప్రజాదర్బార్'

- సమస్యలను విన్నవించేందుకు 14వ రోజు భారీగా తరలివచ్చిన ప్రజలు
- నమస్కారం తాతయ్య, నమస్కారం అమ్మ.. అంటూ మంత్రి ఆత్మీయ పలకరింపు



**అమరావతి, ప్రజానావ:** ఉండవల్లిలోని నివాసంలో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్న "ప్రజాదర్బార్" నూతన ఒరవడితో ముందుకు సాగుతోంది. సమస్యలు విన్నవించేందుకు వచ్చిన ప్రజలను నమస్కారం తాతయ్య, నమస్కారం అమ్మ, నమస్కారం చెల్లీ అంటూ ఆత్మీయంగా పలకరిస్తున్న యువనేత.. వారి నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తున్నారు. గత ప్రభుత్వంలో సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన వారిని బారికేడ్లతో నిలువరించి అనేక ఇబ్బందులకు గురిచేశారు. నేడు ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరిని నేరుగా కలిసి విజ్ఞప్తులను స్వీకరించడంతో పాటు ఆయా సమస్యల పరిష్కారానికి సిబ్బంది ఆదేశాలు జారీ చేశారు. 14వ రోజు ప్రజాదర్బార్ కు మంగళగిరి నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కొంతమంది ఆయాలు, పారిశుద్ధ్య కార్మికులను గత ప్రభుత్వం అర్ధాంతరంగా తొలగించిందని, ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని విజయవాడకు చెందిన ఏపీజీసీఏఎస్ యూనియన్ ప్రతినిధులు నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 9 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నామని, పాఠశాలల విలీనం వల్ల పని ఒత్తిడి పెరిగిందని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కనీసం వేతనం అమలుచేయడంతో పాటు అకారణంగా విధుల నుంచి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఆయాలు, పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను విన్న మంత్రి లోకేష్... పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. పక్షవాతంతో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని మంగళగిరి నియోజకవర్గం మెల్లంపూడికి చెందిన సీహెచ్ వెంకటేశ్వర్లు లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన సతీమణి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం చేయాలని మంగళగిరి హుడా కాలనీకి చెందిన షేక్ మౌలాలి కోరారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న తాడేపల్లి కిస్నా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల జీతం బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కేసీ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. తమ ప్రాంతంలో తాగునీటి సరఫరాతో పాటు వీధి లైట్లు ఏర్పాటుచేయాలని ఆత్మకూరులోని సీతారామ అపార్ట్మెంట్ వాసులు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన అక్రమాలపై న్యాయ విచారణ జరిపించి, తక్షణమే వైస్ ఛాన్స్ లర్ ను నియమించాలని విశాఖకు చెందిన ఏపీ బీసీ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. తిరుపతి జిల్లా నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తున్న తనను గత ప్రభుత్వం అకారణంగా తొలగించిందని, తిరిగి ఉద్యోగం కల్పించాలని ఎన్. మహేశ్వరి కోరారు. శ్రీశైలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న తనకు మినిమమ్ టైమ్ స్కేల్ వర్తింపజేయాలని డీసీ ఉన్నూరు సాహెబ్ కోరారు. గుంతకల్లు నియోజకవర్గం కసాపురం గ్రామంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ కు మరమ్మతులు చేయించి 8 గ్రామాల ప్రజలకు తాగునీటి వసతి కల్పించాలని వై.జీవన్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## కలుషితాహారంతో విద్యార్థులకు అస్వస్థత

**మెదక్, ప్రజానావ:** మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ హాస్టల్ లో విద్యార్థులు అస్వస్థకు గురయ్యారు. ఉదయం అల్పాహారం దొడ్డు ఉప్మా తిన్న విద్యార్థులు ఒక్కొక్కరుగా వాంతులు చేసుకున్నారు. దీంతో వెంటనే 20 మంది విద్యార్థులను రామయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు సిబ్బంది. ముగ్గురికి తీవ్రస్వస్థతకు గురి కాగా.. మరో 17 మందికి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వీరిని పరీక్షించిన వైద్యులు ఇంటికి పంపించారు. ముగ్గురు విద్యార్థినీలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో 20 మంది విద్యార్థులు తమకు కళ్ళు తిరుగుతున్నాయని చెప్పడంతో వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.



## స్కిల్ సెంటర్ టీచర్స్‌తో సమావేశం


**హైదరాబాద్, ప్రజానావ:** ఏబీవీ ఫౌండేషన్ స్కిల్ సెంటర్ చైర్మన్ కావ్య కిషన్ రెడ్డి పార్లమెంట్‌లో ఉన్న స్కిల్ సెంటర్ టీచర్స్‌తో మీటింగ్ నిర్వహించారు. స్కిల్ సెంటరర్‌లో ఉన్న సమస్యల గురించి మరియు కమ్యూనిటీ హాల్స్ వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. పార్లమెంట్లో మొత్తం ప్రస్తుతం 16 స్కిల్ సెంటర్స్ రన్ అవుతున్నాయని తెలిపారు. అదే కాకుండా టీచర్స్ వారి వారి సమస్యలన కిషన్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ నీరజ తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

**బిల్లుల చెల్లింపునకు రూ.20వేల లంచం డిమాండ్**
**పక్కా ప్రణాళికతో పట్టుకున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు**



**జనగామ, ప్రజానావ:** పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో రూ. 20 వేలు లంచం తీసుకున్న పంచాయతీ కార్యదర్శిని అవినీతి నిరోధకశాఖ అధికారులు పట్టుకున్నారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ భర్త గవ్వాని నాగేశ్వరరావు గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేశారు. ఇందుకు సంబంధించిన బిల్లుల చెల్లింపు విషయంలో పంచాయతీ కార్యదర్శి పగిడే శివాజీని సంప్రదించాడు. రూ. 20 వేలు ఇస్తే బిల్లులు ఇస్తానని మొండికేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో బాధితుడి నుంచి రూ.20 వేలు తీసుకోగా అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు తనిఖీ చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం తీసుకున్న పంచాయతీ కార్యదర్శిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు తెలిపారు.



## ఆలయంలో చోరీ

**కొడిమ్యాల, ప్రజానావ:** కొడిమ్యాల మండలం నల్లగొండ గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మూలవిరాట్టుకు ఉన్న బంగారు నగలు చోరీకి గురయ్యాయి. అయితే వెండి వస్తువులను మాత్రం దొంగలు అక్కడే వదిలి వెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విచారణ చేస్తున్నట్లు చెప్పారు.



# మొయినాబాద్‌లో ముజ్రా పార్టీ

- అమ్మాయిలతో నగ్నంగా డ్యాన్సులు
- ఫామ్‌హౌస్‌పై ఎస్‌వోటీ పోలీసుల దాడి
- అదుపులోకి ఏడుగురు యువకులు, నలుగురు యువతులు

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** హైదరాబాద్ శివార్లలోని మొయినాబాద్ అర్ధరాత్రి అసభ్యకర పార్టీ ఘటన వెలుగులోకి వచ్చింది. మొయినాబాద్‌లోని ఓ ఫామ్‌హౌస్‌లో ముజ్రా పార్టీ నిర్వహిస్తున్నారని, అమ్మాయిలతో నగ్నంగా డ్యాన్సులు వేయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్‌వోటీ పోలీసులు ఫామ్‌హౌస్‌పై దాడి చేశారు. పార్టీలో పాల్గొన్న ఏడుగురు యువకులు, నలుగురు యువతులను అదుపులోకి తీసుకున్నారు. ముజ్రా పార్టీ కోసం యువతులను ఢిల్లీ నుంచి తీసుకొచ్చారని చెప్పారు. అసభ్య నృత్యాలు, అర్ధనగ్న డ్యాన్సులు చేస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. వారిని మొయినాబాద్ పోలీసులకు అప్పగించామని వెల్లడించారు. కాగా, వారాంతాల్లో హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని ఫామ్ హౌస్‌లలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. ఫామ్‌హౌస్ పేర్లతో నిర్వాహకులు గలీజ్ దందా నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా యువతకు మత్తు పదార్థాలు అందిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి అందమైన అమ్మాయిలను రప్పించి అసభ్య, అర్ధనగ్న డ్యాన్సులు చేయిస్తూ వ్యభిచారం చేయిస్తున్నారు.



# ఆలయాలను అభివృద్ధి చేస్తా

- వేములాడ, కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలను ప్రణాళికతో తీర్చిదిద్దుతా
- పార్టీలకు సంబంధం లేని వ్యక్తినే కుల సంఘాల బాధ్యులుగా నియమించాలి
- రాజకీయ జోక్యం పెరిగితే కుల సంఘాలు చీలే ప్రమాదం
- కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు
- వేములాడలో మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ



**వేములవాడ, ప్రజానావ:** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలను అభివృద్ధి చేసి తీరుతానని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. ఆయా ఆలయాల అభివృద్ధిపై కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్‌ను కలిశానని చెప్పారు. అవసరమైతే ఆయన్ను వేములాడకు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ప్రధాని మోడీ దక్షిణకాశీ వేములవాడకు వచ్చిన నేపథ్యంలో రాజరాజేశ్వర ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఒక ప్రణాళిక ప్రకారం ఆలయాల అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. మంగళవారం వేములవాడ నియోజకవర్గ పర్యటనలో భాగంగా పట్టణంలోని మున్నూరుకాపు సంఘం భవన నిర్మాణ భూమి పూజలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'జై శ్రీరామ్ అనేటోల్లు నిజమైన మున్నూరు కాపులు. ఇయాళ మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉంది. సంఘ భవన నిర్మాణం కోసం నావంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తా. నా గెలుపునకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా సహకరించారు. నాకు భారీ మెజారిటీ అందించిన వేములవాడ ప్రజల అభివృద్ధి కోసం పనిచేస్తా. స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి పనిచేస్తా. నేను అన్ని కుల సంఘాలకు నిధిలిచ్చిన. దయచేసి రాజకీయ పార్టీలకు సంబంధం లేని వ్యక్తులను కుల సంఘాల బాధ్యతలు అప్పగించాలి. పొరపాటున పార్టీలు జొరబడితే కుల సంఘాలు చీలే ప్రమాదముంది. అందరి సహకారంతో కుల సంఘాలు అభివృద్ధి కావాలి'అని పేర్కొన్నారు.

### నేను మీరు తయారు చేసిన కార్యకర్తను..

'నేను మీరు తయారు చేసిన కార్యకర్తను. కిందిస్థాయి నుంచి ఎదిగిన వ్యక్తిని. మీకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటా. నన్ను అత్యధిక మెజారిటీతో గెలిపించిన వేములవాడ నియోజకవర్గ ప్రజలకు, కుల సంఘాల నాయకులకు రెండు చేతులు జోడించి ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నా. మీకు సాయం చేయడం నేను బాధ్యతగా భావిస్తా. అహంకారంతో వ్యవహరించను. నా బాధ్యతను ఎన్నడూ మీపై పెట్టను. కానీ మీ బాధ్యతలను నేను మోసేందుకు సిద్ధంగా ఉన్నా' అని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించిన వేములవాడ నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేందుకు వేములవాడ పట్టణంలోని భీమేశ్వర గార్డెన్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సభకు బండి సంజయ్ హాజరై వివిధ కుల, వృత్తి సంఘాల నాయకులను సన్మానించారు. ఈ సందర్భంగా సభకు హాజరైన వారిని ఉద్దేశించి ప్రసంగించారు. నన్ను భారీ మెజారిటీతో గెలిపించిన మీ అందరికీ రెండు చేతులు జోడించి ధన్యవాదాలు చెబుతున్నా. నరేంద్రమోడీని ప్రధానమంత్రిని చేయడంలో మీ అందరి భాగస్వామ్యం ఉంది. మీరు నన్ను గెలిపిస్తే నేను మీ తరపున మోడీకి ఓటేసిన. మీరు భారీ మెజారిటీతో గెలిపించినందునే నన్ను కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బాధ్యతలు అప్పగించారు. మీ నమ్మకాన్ని నేను ఎన్నడూ వమ్ము చేయను. కొన్ని పార్టీలకు బాంబు పేలుళ్లు లేవని, అర్ధరాత్రి నక్సలైట్ల హత్యల్లేవని బోర్ కొడుతోందట. అవేమీ లేకుండా చేసిన వ్యక్తి మోడీనే. ఒకవేళ మోడీ ప్రభుత్వం లేకుంటే 370 ఆర్టికల్ రద్దు చేసే సాహసం ఎవరూ చేసేవాళ్లు కారు. మొన్నటి వరకు పార్లమెంట్ చేసే చట్టాలు జమ్మూకాశ్మీర్‌లో వర్తించేవికావు. భారతీయ జెండా ఎగిరేది కాదు. అందుకే 370 ఆర్టికల్ ను రద్దు చేసినం. అక్కడ అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. అయోధ్యలో రామ మందిర నిర్మాణం మోడీ సర్కార్ తోనే సాధ్యమైంది. ఎన్నికల వరకే రాజకీయాలు. ఎన్నికల తరువాత అభివృద్ధి, ప్రజా సంక్షేమమే బీజేపీ ధ్యేయం. వేములవాడ ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు సానుకూలంగా ఉన్నా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సహకరించలేదు. ఈసారి నేను కేంద్ర మంత్రినయ్యాను. వెంటనే రాజన్న ఆలయ అభివృద్ధి కోసం కేంద్ర పర్యటన, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను కలిసిన. ఆయన కూడా సానుకూలంగా ఉన్నారు. నియోజకవర్గంలోని ఎమ్మెల్యే సహా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కొండగట్టు, రాజన్న ఆలయాలను అభివృద్ధి చేసి తీరుతా. ఈ విషయంలో అందరూ కలిసి రావాలని కోరుతున్నా' అని బండి సంజయ్ పేర్కొన్నారు.

# రహదారుల నిర్మాణానికి నిధులు

- కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- చందుర్తిలో సిమెంట్ రహదారుల ప్రారంభోత్సవం



**చందుర్తి, ప్రజానావ:** రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నదని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు రూ.30 లక్షల 50 వేలతో చందుర్తిలో అంతర్గత సిమెంట్ రహదారుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి మంగళవారం రాగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ స్వాగతం పలికారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నదని వివరించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, పంచాయతీ రాజ్ శాఖ ఈఈ సూర్య ప్రకాశ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ ప్రదీప్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రిన్సిపల్‌ను హత్య చేసిన ఇంటర్ విద్యార్థి

**ఏపీలోని ఒంగోలులో ఘటన**

**ఒంగోలు, ప్రజానావ:** ఏపీలోని ఒంగోలుకు చెందిన రాజేష్ అస్సాంలోని శివసాగర్‌లో ప్రైవేటు స్కూల్ ప్రిన్సిపల్, లెక్చరర్‌గా పని చేస్తున్నారు. 11వ తరగతి విద్యార్థికి కెమిస్ట్రీలో తక్కువ మార్కులు వచ్చాయని ప్రవర్తన కూడా బాలేదని రాజేష్ మందలించారు. దీంతో కక్ష పెంచుకున్న ఆ విద్యార్థి క్లాసు చెబుతున్న సమయంలో రాజేష్‌పై కత్తితో దాడి చేశాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజేష్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామంజాపూర్ గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మారం సుమన్ రెడ్డి తన రక్తంతో మంత్రి సీతక్క చిత్రపటాన్ని ప్రత్యేకంగా తయారు చేయించాడు. మంగళవారం మంత్రి పుట్టినరోజును పురస్కరించుకొని ఆ చిత్రాన్ని బహూకరించి తన అభిమానాన్ని చాటుకున్నాడు.

– ములుగు, ప్రజానావ



# రిటైర్డ్ ప్రిన్సిపాల్ పెద్ద మనసు


## బసవతారకం హాస్పిటల్‌కు రూ.కోటి విరాళం

**అమరావతి, ప్రజానావ :** బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్‌కు రిటైర్డ్ ప్రిన్సిపల్ భారీ విరాళం అందజేశారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన రిటైర్డ్ ప్రిన్సిపల్ రమాదేవి కోటి రూపాయల విరాళాన్ని హాస్పిటల్‌కు దానం చేశారు. ఆమె తదనంతరం ఆ ఆస్తి హాస్పిటల్‌కి చెందేలా వీలునామా రాశారు. ఈ మేరకు వీలునామాకి సంభందించిన డాక్యుమెంట్స్ ని ఆమె సంరక్షకులు అమరావతిలో సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుకి అందజేశా రు. ఈమె గతంలో శ్రీకాకుళం ప్రభుత్వ మహిళ డిగ్రీ కాలేజ్‌లో ప్రిన్సిపాల్‌గా పని చేశారు. అనంతరం పదవీ విరమణ చేశారు. ఈమెకు ముగ్గురు కుమారులు. వారందరూ అమెరికాలో స్థిరపడ్డారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు క్యాన్సర్ చికిత్స అందించడంలో బసవతారకం హాస్పిటల్ కు మంచి పేరు ఉంది. క్యాన్సర్‌కు మెరుగైన వైద్యం అందిస్తున్న బసవతారకం హాస్పిటల్‌కు తన ఆస్తిని అందించడం ఆనందంగా ఉందని ఆమె అన్నారు. అవసరం అయితే అమరావతి అభివృద్ధికి కూడా తన వంతు సహాయం అం దించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆమె సంరక్షకులు తెలిపారు. ప్రస్తుతం బసవతారకం ఇండో అమె రికన్ హాస్పిటల్ తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో సేవలు అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లోని టీడీపీ ప్రభుత్వం హయాంలో హాస్పిటల్ కోసం స్థలం కేటాయించారు. తర్వాతి కాలంలో ప్రభు త్వం మారడంతో ఆ దిశగా అడుగులు పడలే దు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో త్వరలోనే ఆంధ్రప్రదేశ్ లోనూ హాస్పి టల్ నిర్మాణం చేపడతామని చైర్మన్ నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ లో ఈ క్యాన్సర్ హాస్పిటల్ ఉంది. సుమారు 650 పడకలు గల ఈ హాస్పి టల్ మెడికల్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ, రేడియేషన్ అంకాలజీ, అంకో పాథాలజీ, లాబొరేటరీస్, ఇతర సేవలు అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో హాస్పిటల్ నిర్మాణం పూర్తి అయితే ఏపీ నుంచి క్యాన్సర్ చికిత్స కోసం హైదరాబాద్ వచ్చే వారి తిప్పలు తిరనున్నాయి.

# పాత్రికేయుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

## కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి వినతి

**ఖైరతాబాద్, ప్రజానావ:** హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న టాప్ తెలుగు టీవీ యూట్యూబ్ ఛానల్‌లో కెమెరామెన్‌గా పనిచేసే 21ఏళ్ల కక్కెర్ల అఖిల్ జూన్ 29న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఈనెల 1న హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో కన్ను మూశాడు. కరీంన గర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి మండలం జీలుగులకు చెందిన అఖిల్ ది అత్యం త నిరుపేద కుటుంబం. తండ్రి మెకానిక్ షాప్ లో హెల్పర్. తల్లి కూలీ పని చేస్తుంది. చేతికం దిన చెట్టంత కొడుకు, ఇంటికి ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు హఠాణ్మరణం చెందడం తో ఆ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని, తగిన విధంగా ఆర్థిక సాయం చేసి అండగా నిలబడాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కక్కెర్ల అఖిల్ నిరుపేద కుటుంబమని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవా లని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ తరఫున కోరుతున్నట్లు తెలిపారు.



# పాత్రికేయులకు ఇచ్చిన మాట తప్పం

## మంత్రి పొన్నం ప్రభాకర్



**ఖైరతాబాద్, ప్రజానావ :** పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని, ఎన్నికల సమయంలో జర్నలిస్టులకు ఇచ్చిన మాటను తప్పేది లేదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి , హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం బషీర్ బాగ్ లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన సీనియర్ ఉర్దూ జర్నలిస్ట్ ఫైజ్ మహమ్మద్ అస్గర్ స్మారక అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో మీడియా అకాడమీ ఛైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డి , ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డితో కలిసి మంత్రి పొన్నం పాల్గొన్నారు. హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగ శంకర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అయిన కాంగ్రెస్ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో చిత్తశుద్ధితో ఉందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా మీడియా తన కర్తవ్యాన్ని చిత్తశుద్ధి, అంకితభావంతో నిర్వర్తించాలని ఆయన సూచించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి వాటిని పరిష్కరించడంలో మీడియాది ప్రముఖ పాత్ర ఉంటుందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలో హెచ్.యూ.జేతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తామని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు.

### అర్హులైన జర్నలిస్టులకు త్వరలోనే న్యాయం : మీడియా అకాడమీ చైర్మన్

మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పాత్రికేయులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అర్హులైన జర్నలిస్టులకు త్వరలోనే న్యాయం జరుగుతుం దన్నారు. అక్రెడిటేషన్, హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాల సమస్యలకు త్వరలోనే పరిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ఐజేయు మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్ , ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ. మాజీద్ , ఐజేయు కార్యవర్గ సభ్యులు సత్యనారా యణ, హెచ్.యూ.జే కార్యదర్శి అబ్దుల్ హమీద్ షౌకత్, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కెఎన్. హరి, తెలంగాణ చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు, వీడియో జర్నలిస్ట్స్ అసోసియే షన్ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### నరేందర్ రెడ్డికి ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు :

దాదాపు 35యేండ్లుగా అటు మీడియా రంగంలో, ఇటు వర్కింగ్ జర్నలిస్ట్స్ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషిస్తున్న సీనియర్ పాత్రికేయులు, ముద్ర దినపత్రిక సంపాదకులు, ఐజేయు జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డిని ఉత్తమ జర్నలిస్టుగా ఎంపిక చేసి, సీనియర్ ఉర్దూ జర్నలిస్ట్ ఫైజ్ మహమ్మద్ అస్గర్ స్మారక అవార్డును మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రధానం చేశారు. అలాగే ఇటీవల తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన కె.శ్రీనివాస్ రెడ్డి , టియుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన కె.విరాహత్ అలీలతో పాటు, టీయుడబ్ల్యూజే కార్యదర్శి వి.యాదగిరి , కోశాధికారి వెంకట్ రెడ్డి , కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి , హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బొమ్మగాని కిరణ్ కుమార్ , టియుడబ్ల్యూజే కార్యవర్గ సభ్యులు ఏ.రాజేష్ , అనిల్ , గౌస్ మోహినుద్దీన్ తదితరులను మంత్రి పొన్నం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న తెలంగాణ మంత్రులు



**విజయవాడ, ప్రజానావ :** తెలంగాణ మంత్రులు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు బెజవాడ ఇంద్రకీలాద్రీపై వేంచేసి ఉన్న కనకదుర్గమ్మను మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ ద్వారం వద్ద మేళతాళాలతో బాబు దంపతులకు వేదపండితులు స్వాగతం పలికారు. అమ్మవారికి పూజలు చేసిన అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. కాగా, సోమవారం మంగళగిరిలో నిర్వహించిన దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సభలో మంత్రులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలకు రావాలని ఆహ్వానించారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలను కూడా ఆహ్వానించిన విషయం తెలిసిందే అందులో భాగంగా వేడకలకు హాజరైన మంత్రులు అనంతరం కనుకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు.



# 16 నుంచి ఏపీ కేబినెట్ సమావేశాలు షురూ

## కీలక విషయాలపై ఫోకస్

**విజయవాడ, ప్రజానావ:** ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి కేబినెట్ సమావేశాలు జరగనున్నాయి. ఇందులో కీలక విషయాలపై చర్చలు కొనసాగే అవకాశం ఉంది. బడ్జెట్ గురించి ప్రధాన చర్చ సాగనుందని తెలుస్తోంది. ఈ నెల 16 నుంచి అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా జరగనున్నాయి. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండోసారి కేబినెట్ భేటీ కాబోతోంది. ఇప్పటికే కీలక హామీలతో పాటు శ్వేతపత్రాలపై దృష్టిపెట్టిన ప్రభుత్వం.. త్వరలో మరిన్ని కీలక నిర్ణయాల దిశగా అడుగులేస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 16న కేబినెట్ భేటీ ఏర్పాటు చేస్తోంది. ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడ్డ అసెంబ్లీ బడ్జెట్ భేటీ నిర్వహించాలా లేక ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పై ఆర్డినెన్స్ జారీ చేయాలా అన్న దానిపై కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది. ఈ నెల 16న వెలగపూడిలోని సచివాలయంలో సమావేశం కానున్న ఏపీ కేబినెట్ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ తో పాటు పలు అంశాలపై చర్చించబోతోంది. ఇందులో సంక్షేమ పథకాల అమలు కూడా ఉంది. ఇప్పటికే ఎన్డీయే ఎన్నికల హామీల్లో భాగమైన పెన్షన్ల పెంపుతో పాటు మరో నాలుగు అంశాలను ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. మిగిలిన వాటిపై ఈసారి కేబినెట్ భేటీలో చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఇందులో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించడంతో పాటు మరికొన్ని అంశాలున్నాయి. వీటికి కేబినెట్ ఆమోద ముద్ర వేసే అవకాశముంది. అలాగే రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వం ఇంకా కుదురుకోకపోవడంతో మరో రెండు, మూడు నెలల కోసం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ద్వారా నిధుల విడుదలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉంది. దీనిపై ఆర్డినెన్స్ విడుదలకు వీలుగా కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది.



# చిన్నారిపై లైంగిక దాడి

**ఇబ్రహీంపట్నం, ప్రజానావ:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని పెత్తుల్లా గ్రామంలో బోడ నరసింహ (50) అనే వ్యక్తి ఎనిమిదేళ్ల చిన్నారికి చాక్లెట్ ఆశ చూపి లైంగికదాడికి పాల్పడ్డాడు. పాప కేకలు వేయడంతో నరసింహ అక్కడి నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఓయూలో రేవంత్ దిష్టిబొమ్మ దహనం

**హైదరాబాద్, ప్రజానావ:** ఉస్మానియా యూనివర్సి టీలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతూనే ఉంది. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట సీఎం రేవం త్ రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్‌వీ నాయకులు దహనం చేశారు. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినదించారు. ఆందోళనకు దిగిన బీఆర్ఎస్‌వీ నాయకులను పోలీసులు చుట్టుముట్టి అదుపు లోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వీ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగుల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ పార్టీ.. నిరుద్యోగుల కన్నీటికి కారణమైందంటూ మండిపడ్డారు. నిరుద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించా లని డిమాండ్ చేశారు. డీఎస్సీని వాయిదా వేసి, 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేయా లని బీఆర్ఎస్‌వీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో నిరుద్యోగులే తగిన బుద్ధి చెప్తారని వారు పేర్కొన్నారు. మరో వైపు ఓయూలో పోలీ సులు భారీగా మోహరించారు. స్థానిక పోలీసులతో పాటు సీఆర్పీఎఫ్ బలగాలను రంగంలోకి దించారు. ల్యాండ్ స్కేప్ గార్డెన్ లోకి ప్రవేశించిన పోలీసు బలగాలు.. విద్యార్థు లను భయభ్రాంతులకు గురి చేశారు. కనిపిం చిన విద్యార్థిని కనిపించినట్టే అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థుల నుంచి పోలీసులు బల వంతంగా సెల్‌ఫోన్లు లాక్కున్నారు. ఫోన్లు ఎందుకు తీసుకుంటున్నారంటూ విద్యార్థులు పోలీసులను నిలదీశారు. దీంతో విద్యార్థుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. పోలీసు బలగాలను చూసి విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ కాలం నాటి పరిస్థితులు గుర్తుకు వస్తున్నాయని గుర్తు చేశారు. అసలు యూనివర్సిటీలోకి పోలీసులకు ఎలా అనుమతిస్తారని ప్రశ్నించా రు. మేం ఉగ్రవాదులం కాదు.. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు కూడా లేదని నిలదీశారు.




# కల్కి చిత్రం ఓ అద్భుత దృశ్యకావ్యం

## నాగ్‌అశ్విన్‌కు మహేశ్ బాబు అభినందనలు

నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన 'కల్కి 2898 ఏడీ' పై ప్రశంసలు కురుస్తూనే ఉన్నాయి. విడుదలైన రోజు నుంచి సినీ, రాజకీయ ప్రముఖులు ఈ చిత్రబృందాన్ని అభినందిస్తూ పోస్ట్‌లు పెడుతున్నారు. ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు వారి అభిప్రాయాన్ని తెలుపగా.. తాజాగా స్టార్ హీరో మహేశ్ బాబు ఎక్స్ వేదికగా కల్కి టీమ్‌కు శుభాకాంక్షలు చెప్పారు. తనదైన శైలిలో మూవీపై రివ్యూ ఇచ్చారు. కల్కి ఓ అద్భుతం.. జస్ట్ వావ్. నాగ్ అశ్విన్ విజన్‌కు హ్యాట్సాఫ్. ప్రతి ఫ్రేమ్ కళాఖండంలా ఉంది. అమితాబ్ బచ్చన్ స్క్రీన్ ప్రజెన్స్‌కు ఎవరూ సరితూగరు. కమల్ హాసన్ ప్రతి పాత్రకు జీవం పోస్తారు. ప్రభాస్ గొప్ప క్యారెక్టర్‌లో చాలా సులభంగా నటించారు. దీపిక ఎప్పటిలాగే అద్భుతంగా కనిపించారు. ఇంతటి భారీ విజయాన్ని సొంతం చేసుకున్న వైజయంతీ మూవీస్‌కు అభినందనలు అని రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌కు దర్శకుడు స్పందిస్తూ.. ధన్యవాదాలు చెప్పారు. 'మీ అభినందనలు అందుకోవడం మా టీమ్‌కు ఆనందంగా ఉంది' అని రిప్లై ఇచ్చారు. నిర్మాణసంస్థ కూడా మహేశ్‌కు థ్యాంక్స్ చెప్పింది.'కల్కి 2898 ఏడీ' విడుదలకు ముందు నుంచే అమెరికాలో ప్రభంజనం సృష్టిస్తోన్న సంగతి తెలిసిందే. అక్కడి ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పిన నాగ్ అశ్విన్ వారితో కలిసి ఈ సినిమా వీక్షించనున్నారు. అమెరికాలోని బి÷-గగెస్ట్ ఐమాక్స్‌లో శనివారం మధ్యాహ్నం ఆయన ఆడియన్స్‌తో కలిసి కల్కి చూడనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణసంస్థ పోస్టర్ విడుదల చేసింది. మరోవైపు కల్కి వసూళ్ల వర్షం కురిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 11 రోజుల్లో ఈ మూవీ



రూ.900 కోట్లకు (గ్రాస్) పైగా వసూలు చేసినట్లు చిత్ర బృందం తాజాగా ప్రకటించింది. ఇప్పటికీ హౌస్‌ఫుల్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. దీంతో త్వరలోనే ఈ చిత్రం రూ.1000 కోట్లు సొంతం చేసుకోవడం ఖాయమని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. అగ్ర నటులు అమితాబ్ బచ్చన్.. అశ్వత్థామగా, కమల్ హాసన్.. సుప్రీం యాస్కిన్‌గా ఆకట్టుకున్నారు. విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్ అతిథి పాత్రలతో అలరించారు. బౌంటీ్ ÷టైర్ భైరవగా సందడి చేసిన ప్రభాస్.. చివరిలో కర్ణుడిగా కనిపించి పార్ట్ 2పై మరిన్ని అంచనాలు పెంచేశారు.

# ఓ ముసలి నక్క అంటూ.. హరీష్ శంకర్ వార్నింగ్



టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ హరీష్ శంకర్ తాజాగా పెట్టిన పోస్ట్ సంచలనం రేపుతోంది. హరీశ్ శంకర్ తన సినిమా అప్‌డేట్‌లను సోషల్ మీడియా వేదికగా పంచుకోవడంతో పాటు అభిమానులకు రిప్లయ్ ఇస్తూ వారికి ఎప్పుడూ టచ్‌లో ఉంటారు. అయితే, కొన్నిసార్లు ట్వీట్స్ వార్ కూడా జరుగుతూ ఉంటుంది. ఇపుడు అలాంటి స్ట్రాంగ్ వార్నింగ్ ఒకటి ట్విట్టర్ ద్వారా షేర్ చేశారు. వివరాల్లోకి వెళితే..ప్రస్తుతం డైరెక్టర్ హరీష్ శంకర్ రెండు సినిమాలను తెరకెక్కిస్తూ బిజీగా ఉన్నారు. అందులో ఒకటి ఉస్తాద్ భగత్ సింగ్ కాగా మరొకటి రవితేజతో మిస్టర్ బచ్చన్. ఈ నేపథ్యంలోనే మొన్నటికి మొన్న ఉస్తాద్ భగత్ సింగ్ ఆగిపోతుం దంటూ ఓ నెటిజన్ నుంచి కామెంట్స్ వినపడగా గట్టి వార్నింగ్‌తో ఇచ్చిపడేశాడు. ఇక తాజాగా మిస్టర్ బచ్చన్ మీద గత కొన్ని రోజులుగా పలు కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఎందుకంటే, ఈ సినిమా ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకుని వచ్చే నెల ఆగష్టు 15న రిలీజ్‌కు రెడీ అవుతుంది. దీంతో ఈ సినిమాకి సంబంధించి గత కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో రకరకాల చర్చలు ఊపందుకుంటున్నాయి. కొంతమంది జర్నలిస్టులు కూడా ఈ సినిమాకి సంబంధించిన లీకులు ఇస్తు వస్తున్నారు. అయితే సినీ సర్కిల్‌లో వినిపిస్తున్న గుసగుసల మేరకు.. సదరు జర్నలిస్ట్ గురించి డైరెక్టర్ హరీష్ శంకర్ తాజాగా చేసిన ట్వీట్.. ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. 'రిలీజ్ దగ్గర పడుతుంది కదా, ఏం పోస్ట్ చేసిన భయపడి తగ్గుతాడు అని ఒక ముసలి నక్క మళ్ళీ మొదలు పెడుతోంది. దయచేసి అలాంటి అపోహలు పెట్టుకోవద్దని మనవి..నా జోలికొస్తే రేపు రిలీజ్ అయినా వదలను'అంటూ హరీష్ శంకర్ వార్నింగ్ ఇచ్చారు. అయితే,ఎవరిపై ఇంతటి కామెంట్స్ చేశాడనేది క్లారిటీ రావాల్సి ఉంది



# టూ పీసెస్ డ్రెస్ వేసుకోమన్నాడు

## అలనాటి ఫోటో షూట్ గుర్తు చేసుకున్న మనీషా

'బొంబాయి'తో దక్షిణాది సినీప్రియులకు చేరువయ్యారు నటి మనీషా కొయిరాల. ఆ సినిమా విజయం తర్వాత పలు కోలీవుడ్ చిత్రాల్లో నటించి మెప్పించారు. కెరీర్ ప్రారంభంలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని మనీషా తాజాగా గుర్తుచేసుకున్నారు. కెరీర్ ప్రారంభంలో ఫొటోషూట్‌లు చేస్తామని కొందరు అడిగేవారు. ఆ సమయంలో ఓ ఫొటోగ్రాఫర్ నన్ను తెగ ప్రశంసించాడు. నేను సూపర్‌స్టార్ అవుతానంటూ పొగిడాడు. ఆ తర్వాత టూ పీసెస్ డ్రెస్ తీసుకొచ్చి వేసుకోవాలని సూచించాడు. నేను స్విమ్మింగ్ చేసే సమయంలోనే ఇలాంటి డ్రెస్‌లు వేసుకుంటానని.. సినిమాల్లో అవకాశాల కోసం ఇలాంటి డ్రెస్‌లు వేసుకోను అని నిర్మొహమాటంగా చెప్పేశాను. దీంతో ఆయన నన్ను తిట్టి అక్కడినుంచి వెళ్లిపోయాడు. 'కరగడానికి నిరాకరించే మట్టిముద్ద నుంచి ఎవరూ బొమ్మను తయారుచేయలేరు' అని అన్నాడు. నేను ఆ మాటలను ఇప్పటికీ మర్చిపోలేదు. అందరి మనస్తత్వం ఒకేలా ఉండదని అర్థం చేసుకున్నా. పెద్ద సెలబ్రిటీ అయ్యాక అతడే వచ్చి నాకు ఫొటోషూట్ చేశాడు' అని మనీషా గుర్తుచేసుకున్నారు. 1991లో ఇండస్ట్రీకి వచ్చిన మనీషా ఆ తర్వాత పలు భాషల్లో వరుస హిట్ చిత్రాల్లో నటించి అలరించారు. 'బొంబాయి' తో తెలుగు ప్రేక్షకులకు అభిమాన నటిగా మారారు. 2012లో ఆమె అండాశయ క్యాన్సర్‌తో బాధ పడుతున్నట్లు వెల్లడించారు. 2014లో దానినుంచి కోలుకున్నట్లు తెలిపారు. క్యాన్సర్ బారినపడడంతో కొన్నేళ్లపాటు విరామం తీసుకున్న ఆమె ఇటీవల సంజయ్‌లీలా భన్సాలీ తెరకెక్కించిన 'హీరామండి' వెబ్ సిరీస్‌లో మల్లికాజాన్‌గా తన నటనతో ఆకట్టుకున్నారు. ప్రస్తుతం ఇది నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారమవుతోంది. త్వరలోనే ఈ వెబ్‌సిరీస్ రెండో భాగం ప్రారంభం కానుంది..

# కిరణ్ అబ్బవరం మూవీ

## టైటిల్ పోస్టర్ రిలీజ్ నేటికి వాయిదా

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం నుంచి రిలీజ్ అవ్వాల్సిన 'క..క'ఐం టైటిల్ పోస్టర్ వాయిదా పడినట్లు సమాచారం. అయితే,'ఐం'టైటిల్ పోస్టర్ కొన్ని కారణాల వల్ల జూలై 10న విడుదల కానున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ చిత్ర ట్రైలర్ ను జులై 13న లేదా 14న ఏదో ఒక తేదీన మేకర్స్ రిలీజ్ చేసే అవకాశం ఉంది.అయితే,రేపు జరగబోయే టైటిల్ పోస్టర్ లాంచ్ ఈవెంట్ లో ట్రైలర్ రిలీజ్ పై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.అయితే,నేడు టైటిల్ ప్రకటన వాయిదా పడటానికి గల కారణం ఏంటంటే..సినీ ఇండస్ట్రీలో ముహూర్తాలకు,మంచి రోజులను తప్పకుండా పాటిస్తారు.ఇంకొందరు అయితే మంచి రోజు లేనిదే సెట్లో కూడా అడుగు పెట్టరు.ఈ నేపథ్యంలో ఈ రోజు ఆషాడం మంచి ముహూర్తం లేని కారణంగా టైటిల్ ప్రకటనను మేకర్స్ వాయిదా వేసినట్లు సమాచారం.శ్రీచక్ర ఎంటర్ టైన్ మెంట్స్,కిరణ్ అబ్బవరం సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాను సుజీత్,సందీప్ ఇద్దరు దర్శకులు తెరకెక్కిస్తున్నారు. పీరియాడికల్ కథతో వస్తున్న ఈ సినిమాకు మేకర్స్ రూ.20 కోట్ల బడ్జెట్ ఖర్చు చేస్తున్నారట.నిజానికి కిరణ్ అబ్బవరం లాంటి హీరోపై రూ.20 కోట్ల బడ్జెట్ అంటే చాలా ఎక్కువ అనే చెప్పాలి.ఒకరకంగా మేకర్స్ రిస్క్ చేస్తున్నట్టే.కానీ,వారు ఎంచుకున్న కథపై నమ్మకంతోనే కిరణ్ పై అంత పెట్టడానికి సిద్ధమయ్యారట. ఇప్పటికే సైలెంట్ గా షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉందట.త్వరలోనే మిగతా పనులన్నీ కంప్లీట్ చేసుకొని అక్టోబర్ లో విడుదల చేయాలని ఫిక్స్ అయ్యారట మేకర్స్.ఇక ఈ న్యూస్ తెలిసి కిరణ్ అబ్బవరం ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.గ్యాప్ ఇచ్చినా పరవాలేదు..పాన్ ఇండియా సినిమాతో వస్తున్నారు కిరణ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.మరి కిరణ్ అబ్బవరం చేస్తున్న మొదటి పాన్ ఇండియా మూవీ ఎలాంటి రిజల్ట్ అందుకోనుందో చూడాలి.





# డ్రగ్స్‌కుత వ్యతిరేకంగా వీడియో

## భారతీయుడు బృందానికి సిఎం రేవంత్ అభినందనలు

భారతీయుడు2' చిత్ర బృందానికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ ,సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో సీక్వెల్‌గా తెరకెక్కిన భారీ బడ్జెట్ చిత్రం భారతీయుడు2. ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో జులై 12న గ్రాండ్‌గా విడుదలకాబోతోంది. ఈ మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్ ఎల్ఎల్‌పి, సీడెడ్ హక్కులను శ్రీలక్ష్మి మూవీస్ సంస్థలు దక్కించుకున్నాయి. ఇప్పుడీ సినిమా యూనిట్.. సీఎం రేవంత్ రెడ్డి షరతును పాటించి ఓ వీడియోను విడుదల చేశారు. అందుకుగానూ సీఎం చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. టీవల సీఎం రేవంత్ రెడ్డి సినిమాల విడుదలకు ముందు టికెట్ల ధరలను పెంచాలని మా వద్దకు వచ్చేవారు తప్పని సరిగా డ్రగ్స్, సైబర్ క్రైమ్ వంటి వాటిపై అవగాహన కల్పిస్తూ వీడియోను చేయాలని షరతు విధించారు. డ్రగ్స్‌పై మెగాస్టార్ చిరంజీవి చేసిన ఓ వీడియో గురించి చెబుతూ.. ప్రతి ఒక్కరూ అలా అవగాహన కల్పించేలా వీడియోలు చేయాలని కోరారు. ఇదే విషయాన్ని 'భారతీయుడు2' మీడియా సమావేశంలో ఓ మీడియా పర్సన్ చిత్రయూనిట్‌ని ప్రశ్నించగా.. హీరో సిద్దార్థ్ కల్పించుకుని.. 'ఇప్పటి వరకు ఏ సీఎం కూడా మీరు ఇది చేస్తే, మేము అది చేస్తామని చెప్పలేదు' అంటూ వ్యంగ్యంగా సమాధాన మిచ్చారు. కానీ మీడియా సమావేశం అయిన కాసేపటికే తన మిస్టేక్‌ను తెలుసుకుని.. సారీ చెబుతూ, సీఎం రేవంత్ రెడ్డి షరతు తప్పకుండా పాటిస్తామని ప్రకటించారు. అనంతరం కమల్ హాసన్, డైరెక్టర్ శంకర్, సిద్దార్థ్, సముద్రఖని.. డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తూ.. ఓ వీడియోని విడుదల చేశారు. ఈ వీడియోని సోషల్ మీడియాలో షేర్ చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. 'డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రజా ప్రభుత్వం చేస్తోన్న ప్రయత్నానికి మద్దతుగా కమల్ హాసన్, శంకర్, సిద్దార్థ్, సముద్రఖని కలిసి ఈ అవగాహనా వీడియో రూపొందించడం హర్షించదగ్గ విషయం. ఈ సినిమా బృందానికి నా అభినందనలు తెలియజేస్తున్నాను' అని ట్వీట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది.



## నాడు బీఆర్ఎస్ కరెక్ట్..
# నేడు కాంగ్రెస్ ద్రోహం

- చేరికలపై నాలుక మడతేసిన కేటీఆర్
- కాంగ్రెస్‌ను తప్పు పడుతూ విమర్శలు
- అయినా ఆగని కాంగ్రెస్ ఆకర్షణలు

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** రాజ్యాంగ బద్ధంగా అంటే..పార్టీలోని మెజార్టీ సభ్యులను విలీనం చేసుకుంటే తప్పులేదు..ఒక్కొక్కరిని చేర్చుకుంటేనే తప్పు. మేం పార్టీని రాజ్యాంగ బద్ధంగా విలీనం చేసుకున్నాం... కాంగ్రెస్ అలా చేయలేదు.. అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజాగా ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ పార్టీపై విమర్శలు ఎక్కుపెట్టారు. అంటే కాంగ్రెస్ ఇప్పుడు ఏక బిగిన చట్టబద్ధంగా, ఎమ్మెల్యేలను వన్ థర్డ్ మెజార్టీతో విలీనం చేసుకోవాలన్న సూచన చేసినట్లు అయ్యింది. అయితే గతానికి భిన్నంగా కాంగ్రెస్ ఒకకో ఎమ్మెల్యేను చేర్చుకుంటోంది. ఇది నూటికినూరు పాల్లు తప్పే. ఈ విషయంలో అన్ని పార్టీలు ఇలాంటి వెర్రి చేష్టలే చేశాయి. ఎలా చేసినా...అధికారంలో ఉన్న పార్టీలు విపక్ష పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నారు. అందుకు బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ మినహాయింపు కాదు. దీనిపై ఇప్పుడు కెటిఆర్ వగచినా లాభం లేదు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ చట్టసభల్లో బలం పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. ఒకవైపు ఎమ్మెల్యేలు, మరోవైపు ఎమ్మెల్సీలను చేర్చుకుంటూ.. అసెంబ్లీలో ఎలాంటి ఇబ్బంది లేకుండా అడుగులు వేస్తోంది. వచ్చే అసెంబ్లీ సమావేశాలకు ముందే శాసనమండలిలో తిరుగులేని పార్టీగా అవతరించాలని చూస్తోంది. అలాగే బిఆర్ఎస్‌ను కూడా దెబ్బతీసి ప్రతిపక్ష హోదా లేకుండా చేసే పనిలో పడింది. గతంలో కెసిఆర్ ఇదే చేశారు. ఇప్పుడు రేవంత్ అదే చేస్తున్నారు. ఇకపోతే తెలంగాణ శాసనమండలిపై కాంగ్రెస్ పార్టీ సీరియస్ ఫోకస్ పెట్టింది. ఇప్పటికే ఎమ్మెల్యేల ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపి సీరియస్‌గా అమలు చేస్తున్న కాంగ్రెస్.. అసెంబ్లీ సమావేశాల్లోపు బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకునేందుకు సీఎం రేవంత్ కసరత్తు ముమ్మరం చేశారు. అటు మండలిపై కూడా గురిపెట్టి.. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్సీలను వరుసగా చేర్చుకుంటున్నారు. మెల్లగా మండలిలో బలం పెంచుకుంటున్నారు. మండలిలో గవర్నర్ కోటాలో రెండు ఖాళీలుండగా.. ప్రస్తుతం 39మంది ఎమ్మెల్సీలు ఉన్నారు. ఇందులో బీఆర్ఎస్‌కు 19మంది, కాంగ్రెస్‌కు 13మంది, బీజేపీ 1, ఎంఐఎం 2, స్వతంత్రులు ఇద్దరు ఎమ్మెల్సీలు ఉన్నారు. ఎంపీ ఎన్నికల ముందు వరకు కాంగ్రెస్ బలం ఐదుగురు ఎమ్మెల్సీలే. ఎంపీ ఎన్నికల సమయంలో పట్నం మహేందరరెడ్డి చేరికతో అది ఆరుకు చేరింది. ఇటీవల ఒకేసారి ఆరుగురి చేరికతో.. కాంగ్రెస్ బలం 12కు పెరిగింది. తాజాగా చల్లా వెంకట్రామిరెడ్డి సీఎంను కలవడంతో ఆయన చేరిక కూడా లాంఛనమే అని తెలుస్తోంది. దీంతో మండలిలో కాంగ్రెస్ బలం 13కు చేరనుంది. బీఆర్ఎస్‌కు చెందిన చాలామంది ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. తమకు తదుపరి హామీ ఇస్తే అన్న రీతిలో చేరేందుకు రెడీగా ఉన్నట్లు సమాచారం. అయితే పార్టీ పాలసీ ప్రకారం ముందే హామీ ఇవ్వలేమని పార్టీలో చేరితే మాత్రం సముచిత స్థానం కల్పిస్తామని ముఖ్యనేతలు భరోసా ఇస్తున్నారు. మండలిలో 2/3 మెజారిటీ సాధిస్తే బీఆర్ఎస్ఎల్పీని కాంగ్రెస్‌లో విలీనం చేయొచ్చు అనే భావనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. మరో 9 మందిని పార్టీలోకి ఆకర్షించి 2/3 మెజారిటీ కంప్లీట్ చేసే యోచనలో ఉంది కాంగ్రెస్. పెద్దల సభలో బలం పెంచుకుని.. హస్తగతం చేసుకోవాలని.. కాంగ్రెస్ భావిస్తోంది. అంతేకాదు భవిష్యత్తులో ప్రభుత్వం తీసుకొచ్చే కీలక బిల్లులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండాలంటే మండలిలో మెజారిటీ చాలా అవసరం. ఎమ్మెల్సీలతో మాట్లాడే బాధ్యతను సీఎం రేవంత్ పలువురు మంత్రులకు అప్పచెప్పినట్టు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి మండలి విషయంలో వేగంగా అడుగులు వేయడానికి కారణాలు లేకపోలేదు. తాను ప్రత్యక్షంగా కాంగ్రెస్‌లో చేరకపోయినా.. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.. తన కొడుకు అమిత్ రెడ్డి రాజకీయ భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీలో చేర్పించి కేసీఆర్ కు షాక్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మండలి చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టే ఆలోచనలో బీఆర్ఎస్ ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. అందుకే అసెంబ్లీ సమావేశాలకు ముందే మెజార్టీ ఎమ్మెల్సీలను కాంగ్రెస్‌లోకి చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకు గుత్తా కూడా సుముఖంగా ఉన్నట్లు సమాచారం. ఆషాడానికి ముందే టాస్క్ పూర్తి చెయ్యాలని, బీఆర్ఎస్ వైఫల్యాలు వారితోనే చెప్పించాలని కాంగ్రెస్ భావిస్తోంది. కొన్నిచోట్ల చేరికలను స్వాగతిస్తుంటే, మరికొన్ని చోట్ల వ్యతిరేకత వినిపిస్తోంది. అందుకే ఈ చేరికలపై బిఆర్ఎస్ ఏడుపు మొదలు పెట్టింది. ఇలాంటి అనుభవం తమకు కూడా వస్తుందని ఆనాడు ఊహించలేక పోయింది. అందుకే ఇప్పుడు కాంగ్రెస్ చేస్తున్న విధానాన్ని విమర్శిస్తోంది.

# రాహుల్ ప్రధాని కావడమే లక్ష్యమా?



### రాష్ట్రాల సమస్యలు పక్కన పెడితే ఎలా?
### కేసీఆర్ అహంకారంపై మాత్రమే ప్రజలు ఓట్లేశారు
### కాంగ్రెస్‌పై ప్రేమతో ఓటేయలేదని గుర్తించని కాంగ్రెస్
### ఎపిలోనూ వ్యూహాత్మకంగా దెబ్బతిన్న కాంగ్రెస్

**హైదరాబాద్, ప్రజానావ:** రాహుల్ ప్రధాని కావాలన్న లక్ష్యంతోనే కాంగ్రెస్ పనిచేస్తోంది. మంచి చేస్తూ ప్రజల మన్ననలు పొందాలన్న ఆసక్తి ఎక్కడా కానరావడం లేదు. పదేపదే రాహుల్ ప్రధాని అంటూ సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కలు వీరతాళ్లు వేసుకుని ఊరేగుతున్నారు. కర్నాకటలో బిజెపి అవినీతి వల్ల కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. తెలంగాణలో కెసిఆర్ అహంకారం కారణంగా, బిజెపి లోపాయకారి ఒప్పందం కారణంగా ఇక్కడ కాంగ్రెస్ గెలిచింది. ఇది జగమెరిగిన సత్యం. బిజెపి ఓ అడుగు వెనకేయడంతో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. అంతే తప్ప రాహుల్‌ను ప్రధానిని చేయడానికో, రేవంత్‌ను సిఎంను చేయడానికి ప్రజలు ఓట్లు వేయలేదు. కేవలం కెసిఆర్ అహంకారం మీద దెబ్బకొట్టేందుకు మాత్రమే ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారు. ఎపిలోజగన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పక్షాన షర్మిల పోరాడినా ప్రజలు నమ్మలేదు. కాంగ్రెస్ తమకు ద్రోహం చేసిందన్న భావనలో ఎపి ప్రజలు ఉన్నారు. అందుకే టిడిపి కూటమి అక్కడ భారీ విజయాన్ని నమోదు చేసింది. ఇవన్నీ అర్థం చేసుకోకుంటే కాంగ్రెస్ మనుగడ కష్టం. కేవలం ఆరు గ్యారెంటీలు, రాహుల్ ప్రధాని అంటూ జపం చేస్తే వచ్చే ఎన్నికల నాటికి కాంగ్రెస్ కూడా మూల్యం చెల్లించుకుంటుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పార్టీని మరింత పటిష్టపరిచే వ్యూహాలతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ముందుకు వెళ్తుంటే దక్షిణాదిన ఆంధ్రప్రదేశ్‌లో అంతర్గత కుమ్ములాటలు తలనొప్పిగా మారాయి. మొన్నటి సార్వత్రిక ఎన్నికలకు ముందు మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి కుమార్తె షర్మిలను అనూహ్యంగా తెరపైకి తీసుకువచ్చిన అధిష్టానానికి ప్రస్తుతం ఆమె వ్యవహార శైలి ఇరకటంలోకి లాగింది. మూడేళ్ల కిందట తెలంగాణ నా మెట్టినిల్లు, ఇక్కడే చదివా, ఇక్కడే పెళ్లి చేసుకున్నా, పిల్లలను కన్నా, చివరి వరకు ఇక్కడే ఉంటా అంటూ మూడేళ్ళ కిందట మహా ఆర్భాటంగా ఏర్పాటు చేసిన 'వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ'ని సరిగ్గా ఎన్నికల సమయానికి పాదయాత్రతో ఆమె తొక్కేశారు. అ తర్వాత సొంత అన్నపై పోరాటం చేస్తానని, మహానేత పేరుతో ఆంధ్రప్రదేశ్ లో పార్టీకి తిరిగి పూర్వ వైభవం తీసుకువస్తా అనే మాటలతో కర్ణాటక నేతలు మధ్యవర్తులుగా షర్మిల పావులు కదిపారు. అప్పటి పరిస్థితులను ఎలా అంచనా వేశారో ఏమో కానీ, అనేక మంది సీనియర్ నేతలు ఆ రాష్ట్రంలో ఉన్న విషయం తెలిసి కుడా షర్మిలను ఏకంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కి అధ్యక్షురాలుగా అధిష్టానం ప్రకటించింది. అంతేకాదు, తమకు దిశా, నిర్దేశం చేసే నాయకత్వం లేకుండా పదేళ్లుగా సుప్తావస్థలో ఉన్న శ్రేణులను ఉత్తేజపరచడానికి ఎన్నికల సమయంలో షర్మిల మాత్రమే సరైనట్టు అధిష్టానం ఆలోచించింది. కానీ, ఆంధ్రాలో కాంగ్రెస్ పార్టీ పగ్గాలు పట్టుకున్న మరుక్షణం నుంచే షర్మిల వ్యూహాలు ఒక్కొక్కటిగా బయటకు వచ్చాయి. జగన్ కి ఆమెకు నాలుగు గోడల మధ్య జరిగిన ఘర్షణలు, కుటుంబ కలహాలను జనానికి పూస గుచ్చినట్టు చెప్పాలని నిర్ణయించుకున్నారు. ఎన్నికల వేదికలను అడ్డాగా మార్చుకున్నారు. దీనికి ఆమె చేసిన ప్రసంగాల రికార్డులే సజీవ సాక్ష్యం. కాంగ్రెస్ పార్టీ హామీలు ప్రచారం చేస్తూ ఓట్లు అడగాల్సిన సభల్లో కేవలం అన్నయ్య జగన్ ని దోషిగా నిలబెట్టే ప్రసంగాలు, ప్రయత్నాలు చేయడం పార్టీకి తీరని నష్టం చేసిందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇది తెలిసి వచ్చింది. వైఎస్ లెగసీని తాను సొంతం చేసుకునేందుకు ఇప్పుడు ప్రయత్నాలు మొదలు పెట్టారు. వైఎస్ జయంతి ద్వారా అందిరినీ పిలిపించి మాట్లాడారు. ఇకపోతే షర్మిల కుటుంబ వ్యవహారాలు తెలుసుకుందామనే తాపత్రయం అప్పట్లో సామాన్య జనంలోనూ కనిపించింది. ఏ సభలో జగన్ పై ఎలాంటి కొత్త విషయాన్ని వెళ్లడిస్తుందో అన్న ఆసక్తి సైతం ప్రజల్లో పెరగడం విశేషం. బహుశా విషయాలు తెలుసుకోవడానికే కాబోలు ఆమె సభలకు అశేషంగా జనం కూడా వచ్చారనే వాదనలు కూడా రచ్చబండల వద్ద వినిపించాయి. వైఎస్ ఆశయాలను, కాంగ్రెస్ పార్టీ హామీలను సమర్ధవంతంగా ప్రజల్లోకి ప్రజల వద్దకు తీసుకువెళ్ళక పోవడం ఫలితంగానే మొన్నటి ఎన్నికల్లో ఆంధ్రా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా గెలవలేక పోయిందనే విశ్లేషణలు వస్తున్నాయి. చివరకు షర్మిల కూడా సొంత గడ్డపై ఓటమిని చవి చూశారు. కనీసం వైఎస్ ఆత్మగా పేరున్న కెవిపి రామచంద్రరావుకి సభా వేదికలపై సముచిత స్థానం కల్పించి ఉంటే ఎంతోకొంత ఫలితం దక్కేదనే సూచనలు వస్తున్నాయి. షర్మిల ప్రసంగాలు మొత్తంగా జగన్‌ను దెబ్బతీయడానికి పనికి వచ్చాయి. జగన్‌ను డ్యామేజ్ చేయడానికి పనికి వచ్చాయి. అవి కూటమికి బాగా కలసి వచ్చాయి. షర్మిల కుటుంబ విషయాలను పక్కన పెట్టి, పార్టీ వ్యూహాలను జనంలోకి తీసుకువెళ్లగలిగేలా మంత్రాంగం జరిగివుంటే కాంగ్రెస్ అబ్ది పొందేది. కనీసం ఒకటో రెండో అసెంబ్లీ సీట్లయినా వచ్చేవి.ఎన్నికల తర్వాత ఆమె ఆ రాష్ట్రంలోని పార్టీ నాయకులకు దూరం అయ్యారనే ఆరోపణలు మొదలయ్యాయి. ఇంత కాలం పార్టీ కోసం పని చేసిన సీనియర్లను సైతం పక్కన పెట్టి కొంతమంది అనుయాయులతో ఒంటెత్తు పోకడలు అవలంబిస్తోందని కొందరు నేతలు అధిష్టానానికి ఫిర్యాదు కూడా చేయడం గమనార్హం. అధిష్టానం ఏర్పాటు చేసిన కమిటీలను రద్దు చేస్తున్నట్టు షర్మిల ప్రకటించడంతో రాజుకున్న నిరసన సెగ డిల్లీ పెద్దలకు అంటుకుంది. పార్టీలో క్రియాశీలకంగా ఉన్న వారిని పిలిచి మాట్లాడడం జరగడం లేదు. అందరినీ కూడగట్టి బలంగా నిలబడే ప్రయత్నాలుచేయడం లేదు. ఇదిలా ఉంటే, గత ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయానికి షర్మిల నైతిక బాధ్యత వహించాలని ఆంధ్రా కాంగ్రెస్ కమిటీ సీనియర్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఆమె సొంత నిర్ణయాల వల్ల భవిష్యత్తులో పార్టీకి మరింత తీరని నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని కూడా కొందరు పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, శివ కుమార్ ల దృష్టికి తీసుకువెళ్ళారు. కొద్ది రోజులుగా ఇలాంటి అంతర్గత కుమ్ములాటలు మరీ అధికమయ్యాయి. ఇలాంటి చర్యలతో పార్టీ మనుగడ సాగించదని గుర్తించాలి. వ్యక్తి ఆరాధనను ఇకనైనా కాంగ్రెస్ నేతలు మానుకోవాలి. అప్పుడే పార్టీ బలపడగలదు.

## భూసార కేంద్రాల తీరు అస్తవ్యస్థం

### సమయానికి అక్కకు రాని పరీక్షలు



**విశాఖపట్టణం, ప్రజానావ:** సిబ్బంది కొరతతో భూసార పరీక్షా కేంద్రాలు నిస్తేజంగా మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలో అన్ని గ్రామ పంచాయతీల్లో భూసార పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఏటా జనవరి నుంచి మే నెలాఖరు వరకు మాత్రమే భూసార పరీక్షలు చేస్తుంటారు. మిగిలిన సమయంలో భూసార పరీక్షలు పెద్దగా జరగవు. అంతేకాకుండా గత ఏడాది నుంచి మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, ఆ గ్రామంలో ఉన్న అన్ని సర్వే నంబర్లలోని భూముల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో నామమాత్రంగా ఉన్న సిబ్బంది పైలట్ గ్రామాల్లో మాత్రమే భూసార పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో నాలుగు కేంద్రాలు వుండగా, ఒక్క అనకాపల్లిలో మాత్రమే భూసార పరీక్షలు జరుగుతున్నాయి. పొలాల్లో మట్టిని సేకరించి, ల్యాబ్‌లో పరీక్షించి రైతులకు వివరాలు అందజేయడానికి ఎవరూ లేకుండా పోయారు. ఆయా కేంద్రాలకు రైతులకు తీసుకువచ్చిన మట్టి నమూనాలను అనకాపల్లి పంపుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రస్తుతం ఉన్న భూసార పరీక్షా కేంద్రాల పరిస్థితి పరిశీలించగా... మొక్కుబడిగా పనిచేస్తున్న విషయం తెలిసింది. జిల్లాలో నర్సీపట్నం, అనకాపల్లి, పాడేరు, విశాఖపట్నంలో మాత్రమే భూసార పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో సంచార భూసార పరీక్షా కేంద్రం ఉంది. అయితే ఈ కేంద్రం జిల్లాలో సంచరించేందుకు వాహనం లేకపోవడంతో అక్కడ ఉండే సిబ్బందికి జిల్లాలో కొన్ని మండలాలకు కేటాయించారు. నర్సీపట్నంలో భూసార పరీక్షా కేంద్రాన్ని సుమారు పదేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. కొన్నాళ్ల తర్వాత తొలగించారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో సరైన సిబ్బంది లేరు. కేంద్రంలో మట్టి నమూనాలను పరీక్షించేందుకు అవసరమైన పరికరాలు, రసాయనాలు, ఇతర సామగ్రి ఉన్నప్పటికీ పరీక్షలు నిర్వహించే సిబ్బంది లేకపోవడంతో అలంకారప్రాయంగా మారింది. దీంతో రైతులు ఎవరైనా మట్టి నమూనాలను తీసుకువస్తే వాటిని అనకాపల్లి భూసార పరీక్షా కేంద్రానికి పంపిస్తున్నారు. పాడేరు కేంద్రంలో కూడా దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది.

## ఫసల్ బీమా యోజన
# వెంటనే అమలు చేయాలి

### బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా




**షాద్‌నగర్, ప్రజానావ:** తెలంగాణలో ఫసల్ బీమా యోజన వెంటనే అమలు చేయాలి అని ఫరూక్నగర్ భారతీయ జన తా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అందే బాబయ్య మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో రైతులను ఉద్దేశించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాలుగు నుంచి ఐదు పథకాలు రైతులకు అమలు చేస్తానని మోసం చేశారు. వీటిలో ముఖ్యమైనది రైతులకు రెండు లక్షల రుణమాఫీ, కానీ ఇప్పటివరకు రుణమాఫీ చేసింది లేదు. గతంలో బీఆర్ఎస్ పార్టీ లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తాం అని మోసం చేసింది. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా మోసం చేశారు. నేను ఒక రైతునే నాకు ఇప్పటివరకు రెండు లక్షల రుణమాఫీ కాలేదు, చివరికి ముఖ్యమంత్రి తెలంగాణ ప్రజల కు గాడిద గుడ్డు చూపెట్టాడు. రెండవది కౌలు రైతుల సమ స్య, కౌలు రైతులకు ఏడాదికి 12,000 ఇస్తానని మోసం చేశారు. కౌలు రైతులు తమకు 12000 వస్తాయని నమ్మి ఓట్లు వేస్తే చివరకు గుండు సున్న చుయించారు. మూడవది రైతుబంధు గత ప్రభుత్వం 10000 ఇస్తామని హామీ ఇచ్చారు కానీ ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి 15000 లు ఇస్తానని ప్రగల్బల్ పలికారు కానీ ఇప్పటివరకు కౌలు రైతులకు ముట్టిందేమీ లేదు. ఇప్పటికైనా మేల్కొని ఇచ్చిన హామీల అమలు చేయాలని కోరారు. పాలమూరు విష్ణువర్ధ న్ రెడ్డి మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా పిలుపుమేరకు మంగళవారం తహసిల్దార్ కార్యాల యంలో తహసిల్దార్‌కు వినతి పాత్ర వేయడం జరిగింది. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి గెలిచిన తర్వాత రైతు ప్రభుత్వం చేస్తానని మాట ఇచ్చారు, గెలిచి 200 రోజులు గడిచిన ఇప్పటివరకు రైతుల ఊసే లేదు. రాష్ట్రంలో ఏదో ఒక గ్రామంలో రైతుల ఆత్మహత్యలు వినడం బాధాకరం. కేంద్రంలో ఫసల్ బీమా పథకం అమలు చేయడం జరిగింది. కానీ గత ప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని నిర్వీ ర్యం చేశారని చెప్పారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి ఈ ఫసల్ బీమా పథకాన్ని అమలు చేస్తానన్నారు కానీ ఇప్పటివరకు దాని మాటే లేదు. పంటలకు మద్దతు ధర ఇస్తానని మాటిచ్చారు కానీ, పంటల మద్దతు ధర ఏమైంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు రామ కృష్ణ యాదవ్, పట్టణ అధ్యక్షులు హరి భూషణ్ పటేల్, కాసోజు శివ, శ్యామసుందర్, రుషికేష్, వంశీ కృష్ణ, అందెల సందీప్ కిరణ్ గౌడ్, ఇస్నాతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

www.prajanaava.in || హైదరాబాద్ బుధవారం, జులై 10, 2024 || ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..




# జైస్వాల్, శాంసన్ ఇన్

## నేడు జింబాబ్వేతో భారత్ మూడో టీ20

**హరారే:** జింబాబ్వేతో బుధవారం జరిగే మూడో టీ20కి కుర్రాళ్లతో కూడిన టీమిండియా సమరోత్సాహంతో సిద్ధమైంది. రెండో టీ20లో భారత్ వంద పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అంతేగాక ఈ మ్యాచ్‌లో యశస్వి జైస్వాల్, సంజూ శాంసన్‌లు చేరడంతో జట్టు మరింత బలోపేతంగా తయారైంది. రెండో టీ20లో అద్భుత సెంచరీతో అదరగొట్టిన యువ సంచలనం అభిషేక్ శర్మ మరోసారి చెలరేగేందుకు సిద్ధమయ్యాడు. యశస్వి జైస్వాల్, శాంసన్‌ల రాకతో జట్టు బ్యాటింగ్ మరింద బలోపేతంగా తయారైంది. అంతేగాక శివమ్ దూబె కూడా జట్టులో చేరాడు. అతని రూపంలో మెరుగైన ఆల్‌రౌండర్ జట్టుకు అందుబాటులో వచ్చాడు. అయితే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పేలవమైన ఫామ్ కలవరానికి గురి చేస్తోంది. రెండో టీ20లో గిల్ నిరాశ పరిచాడు. ఈ మ్యాచ్‌లో అతను తన బ్యాట్‌కు పనిచెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే సత్తా కలిగిన గిల్ కొంతకాలంగా వరుస వైఫల్యాలు చవిచూస్తున్నాడు. కనీసం ఈసారైనా మెరుగ్గా రాణిస్తాడా లేదా అనేది సందేహంగా తయారైంది. రుతురాజ్ ఫామ్‌లోకి రావడం జట్టుకు శుభసూచకంగా చెప్పాలి. కిందటి మ్యాచ్‌లో రుతురాజ్ అద్భుత బ్యాటింగ్‌ను కనబరిచాడు. ఈసారి కూడా అతనిపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. అభిషేక్ శర్మ ఫామ్‌ను అందుకోవడం జట్టుకు కలిసి వచ్చే అంశమే. రెండో టీ20లో రుతురాజ్‌తో కలిసి అభిషేక్ మెరుపులు మెరిపించాడు. మూడో టీ20లోనూ జట్టుకు కీలకంగా మారాడు. రియాన్ పరాగ్, రింకు సింగ్ వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లు జట్టులో ఉన్నారు. సంజు శాంసన్ చేరికతో జట్టు బ్యాటింగ్ మరింత బలోపేతంగా మారింది. ఎటువంటి బౌలింగ్‌నైనా చిన్నాభిన్నం చేసే సత్తా శాంసన్‌కు ఉంది. ఐపిఎల్‌లో అత్యంత నిలకడైన ఆటతో అలరించిన శాంసన్‌కు వరల్డ్‌కప్‌లో ఆడే అవకాశం దక్కలేదు. అయితే జింబాబ్వేతో జరిగే మూడో టీ20లో అతనికి తుది జట్టులో స్థానం ఖాయంగా కనిపిస్తోంది. దూబె కూడా చేరడంతో జట్టు మరింత పటిష్ఠంగా తయారైంది. ముకేశ్ కుమార్, బిష్ణోయ్, అవేశ్ ఖాన్‌లు మెరుగైన బౌలింగ్‌తో అలరిస్తున్నారు. ఈసారి కూడా బౌలర్లు జట్టుకు కీలకంగా మారనున్నారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకంగా ఉన్న భారత్ ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

### తక్కువ అంచనా వేయలేం..

మరోవైపు ఆతిథ్య జింబాబ్వే టీమ్‌ను కూడా తక్కువ అంచనా వేసే పరిస్థితి లేదు. ఆ జట్టులో కూడా ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవలేదు. ఇన్నొసెంట్ కైయ, వెస్లీ మధెవర్, బ్రియాన్ బెన్నెట్, సికందర్ రజా, క్యాంప్‌బెల్, క్లైవ్ మదాండె, జోంగ్వే, మసకద్జాలతో జింబాబ్వే చాలా బలంగా ఉంది. ఒంటి చేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే సత్తా కలిగిన కెప్టెన్ సికందర్ రజాపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. సికందర్ చెలరేగితే భారత్‌కు ఇబ్బందులు తప్పక పోవచ్చు. మధెవర్, బెన్నెట్ తదితరులు ఫామ్‌లో ఉండడం జింబాబ్వేకు కలిసి వచ్చే అంశమే. దీనికి తోడు సొంత గడ్డపై ఆడుతుండడం మరింత సానుకూల పరిణామంగా చెప్పాలి. రెండు జట్లలోనూ ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉండడంతో పోరు ఆసక్తికరంగా సాగడం ఖాయం.

# చివరి టీ20 మనదే

## సౌతాఫ్రికా మహిళలతో సిరీస్ సమం




**చెన్నై:** సౌతాఫ్రికా మహిళలతో మంగళవారం జరిగిన మూడో, చివరి టీ20లో భారత్ పది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో టీమిండియా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 11తో సమం చేసింది. తొలి టీ20లో సౌతాఫ్రికా విజయం సాధించగా, రెండో టీ20 వర్షం వల్ల రద్దయ్యింది. ఇక మూడో టీ20లో ఆతిథ్య భారత్ గెలవడంతో సిరీస్ సమంగా ముగిసింది. తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 17.1 ఓవర్లలో కేవలం 84 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్లు అద్భుత బౌలింగ్‌తో ప్రత్యర్థి టీమ్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేయడంలో సఫలమయ్యారు. సఫారీ టీమ్‌లో తంజీమ్ బ్రిట్స్ (20), మరిజానె కాప్ (10), అంకె బోస్చ్ (17) మాత్రమే రెండంకెల స్కోరును అందుకున్నారు. మిగతా వారు సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరారు. దీంతో జట్టు ఇన్నింగ్స్ 84 పరుగుల వద్దే ముగిసింది. భారత బౌలర్లలో పూజా వస్త్రకర్ అద్భుత బౌలింగ్‌ను కనబరిచింది. 13 పరుగులు మాత్రమే ఇచ్చి నాలుగు వికెట్లను పడగొట్టింది. రాధా యాదవ్ కూడా మెరుగైన బౌలింగ్‌తో జట్టు విజయంలో



తనవంతు పాత్ర పోషించింది. రాధా ఆరు పరుగులకు మూడు వికెట్లను తీసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 10.5 ఓవర్లలోనే ఒక్క వికెట్ కూడా కోల్పోకుండానే విజయాన్ని అందుకుంది. ఓపెనర్లు షెఫాలీ వర్మ 27 (నాటౌట్), స్మృతి మంధాన 54 (నాటౌట్) అద్భుత బ్యాటింగ్‌తో జట్టును గెలిపించారు. అద్భుత బౌలింగ్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన పూజా వస్త్రకర్‌కు ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు దక్కింది.

## ఐసీసీ ప్లేయర్ ఆఫ్‌ది మంత్ క్రికెటర్లుగా

# బుమ్రా, మంధాన







**దుబాయి:** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్లేయర్ ఆఫ్‌ది మంత్ క్రికెటర్స్ అవార్డులను టీమిండియా ప్లేయర్లు జస్‌ప్రీత్ బుమ్రా, స్మృతి మంధానలు గెలుచుకున్నారు. మహిళల విభాగంలో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన, పురుషుల విభాగంలో స్పీడ్‌స్టర్ బుమ్రాలు ప్లేయర్ ఆఫ్‌ది మంత్ అవార్డులను సొంతం చేసుకున్నారు. ఇటీవల ముగిసినటి20 ప్రపంచకప్‌లో బుమ్రా అసాధారణ బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. మెగా టోర్నమెంట్‌లో అత్యంత నిలకడైన ప్రదర్శన కనబరిచిన బుమ్రా 15 వికెట్లను పడగొట్టాడు. అంతేగాక ప్రతిష్ఠాత్మకమైన ప్లేయర్ ఆఫ్‌ది టోర్నమెంట్ అవార్డును కూడా దక్కించుకున్నాడు. దీంతో బుమ్రాకు ప్లేయర్ ఆఫ్‌ది మంత్ అవార్డు వరించింది. ప్రతిష్ఠాత్మకమైన అవార్డు దక్కడంపై బుమ్రా ఆనందం వ్యక్తం చేశాడు. తనకు లభించిన అరుదైన గౌరవంగాదీన్ని అభివర్ణించాడు. భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రదర్శన చేసేందుకు ఇలాంటి అవార్డులు దోహదం చేస్తాయని పేర్కొన్నాడు. మరోవైపు దక్షిణాఫ్రికాతో సొంత గడ్డపై జరుగుతున్న సిరీస్‌లో అసాధారణ ఆటతో అదరగొడుతున్న భారత స్టార్ మహిళా క్రికెటర్ మంధానకు కూడా ఐసీసీ అవార్డు దక్కింది. సౌతాఫ్రికా సిరీస్‌లో మంధాన వరుస శతకాలతో పెను ప్రకంపనలు సృష్టించింది. దీంతో మంధానను ఐసిసి ప్లేఆయర్ ఆఫ్‌ది మంత్ అవార్డు లభించింది. ఐసీసీ అవార్డు రావడంపై మంధాన ఆనందం వ్యక్తం చేసింది. ఈ పురస్కారం తన ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసిందని పేర్కొంది.

# ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన యూవీ

**న్యూఢిల్లీ:** మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తాను బుక్ చేసుకున్న ఫ్లాట్‌ను డెలివరీ చేయడంలో జాప్యం జరుగుతుందని.. తనకు, రియల్ ఎస్టేట్ కంపెనీకి మధ్య ఉన్న వివాదాన్ని పరిష్కరించేందుకు మధ్యవర్తిని నియమించాలని కోర్టును కోరారు. ఈ మేరకు కోర్టు రియల్ ఎస్టేట్ కంపెనీకి నోటీసులు జారీ చేసింది. రియల్ ఎస్టేట్ సంస్థ బ్రిలియంట్ ఎటోయిల్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. వ్యక్తిగత హక్కులను ఉల్లంఘించారని, కంపెనీ తాను బుక్ చేసిన ఫ్లాట్ డెలివరీలో జాప్యం జరిగిందని యూవీ ఆరోపించారు. మాజీ క్రికెటర్ 2021లో ఢిల్లీలోని హౌస్‌ఖాన్ సంస్థతో ఒక ఫ్లాట్ బుక్ చేశారు. ఆ సమయంలో ఫ్లాట్ ధర రూ.14.10కోట్లుగా పేర్కొన్నాడు. యూవీకి నవంబర్ 2023లో స్వాధీనం చేసుకోవాలని కంపెనీ నుంచి లెటర్ వచ్చింది. ఫ్లాట్‌ను సందర్శించిన సమయంలో పనుల్లో నాణ్యత లోపించిందని.. బిల్డర్ మెటీరియల్స్ రాజీ పడ్డారని, అపార్ట్‌మెంట్ ఫిట్టింగ్‌లు, ఫర్నిషింగ్‌లు, లైటింగ్,




ఫినిషింగ్ నాణ్యత ఏమాత్రం బాగాలేదని పేర్కొన్నారు. ఫ్లాట్ డెలివరీలో జాప్యం, నాసిరకం మెటీరియల్స్ వాడినందుకు నష్టపరిహారం చెల్లించాలని యూవీ కోరారు. డెవలపర్ తన బ్రాండ్ విలువను దుర్వినియోగం చేశాడని.. ఒప్పంద కాలానికి మించి తన వ్యక్తిత్వ హక్కులను ఉపయోగించడం ద్వారా అవగాహన ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించినట్లుగా ఆరోపించారు. నవంబర్ 2023 తర్వాత ప్రాజెక్టు ఎంఓయూ రద్దయినా బిల్‌బోర్డులు, ప్రాజెక్ట్ సైట్‌లు, సోషల్ మీడియా పోస్టుల్లో తన ఫొటోలను ఉపయోగించారని పేర్కొన్నారు.



## టీమిండియా ప్రధాన కోచ్‌గా

# గౌతం గంభీర్

**ముంబై:** టీమిండియా ప్రధాన కోచ్‌గా భారత మాజీ క్రికెటర్ గౌతం గంభీర్ ఎంపికయ్యాడు. గంభీర్ రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నాడు. గంభీర్ ఎంపిక విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి జై షా ఎక్స్ వేదికగా వెల్లడించారు. సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో గంభీర్ ఎన్నో పాత్రలను పోషించాడు. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు కెప్టెన్‌గా వ్యహరించి ట్రోఫీలను అందించాడు. అంతేగాక ఈ సీజన్‌లో మెంటార్ బాధ్యతలు నిర్వర్తించి జట్టు ఐపీఎల్ ట్రోఫీ సాధించడంలో తనవంతు పాత్ర పోషించాడు. గంభీర్ ఎంపికతో కొంతకాలంగా ప్రధాన కోచ్ పదవిపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఇప్పటి వరకు టీమిండియా హెడ్ కోచ్‌గా వ్యవహరించిన రాహుల్ ద్రవిడ్ పదవి కాలం వరల్డ్‌కప్‌తో ముగిసింది. ఈ క్రమంలో కొత్త కోచ్‌ను ఎంపిక చేసేందుకు భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) దరఖాస్తులను ఆహ్వానించింది. కోచ్ పదవి కోసం భారత్‌తో పాటు విదేశీ క్రికెటర్లు సయంతం దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ప్రత్యేక ఇంటర్వ్యూలు నిర్వహించిన బీసీసీఐ అధికారులు చివరికి గంభీర్‌ను ప్రధాన కోచ్‌గా ఎంపి చేశారు. త్వరలో ప్రారంభమయ్యే శ్రీలంక సిరీస్‌తో గంభీర్ తన బాధ్యతలను చేపడుతాడు. కాగా, సహాయక కోచ్‌ల ఎంపిక విషయంలో బీసీసీఐ గంభీర్‌కు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్టు తెలిసింది. తాను కోరుకున్న వారిని సహాయకులుగా ఎంపిక చేయాలని గంభీర్ చేసిన విజ్ఞప్తికి బీసీసీఐ పెద్దలు సానుకూలంగా స్పందించారు. అంతేగాక జీతభత్యాల విషయంలో కూడా పూర్తి స్పష్టత వచ్చిన తర్వాతే గంభీర్ కోచ్ పదవి నిర్వహించేందుకు ఒప్పుకున్నట్టు తెలిసింది. కాగా, ఓపెనర్‌గా టాప్ ఆర్డర్ బ్యాటర్‌గా గంభీర్ భారత్ ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించాడు. రెండు వరల్డ్‌కప్‌లు గెలిచిన జట్టులోనూ గంభీర్ సభ్యుడిగా ఉన్నాడు. అతని సారథ్యంలో కోల్‌కతా రెండు సార్లు ఐపీఎల్ ట్రోఫీలను గెలుచుకుంది. తాజాగా అతని పర్యవేక్షణలో మరోసారి కోల్‌కతా ఐపీఎల్ విజేతగా నిలిచింది. అపార అనుభవజ్ఞుడైన గంభీర్ ప్రధాన కోచ్‌గా రావడాన్ని క్రికెటర్లు స్వాగతించారు. అతని పర్యవేక్షణలో భారత జట్టు మరింత మెరుగైన ప్రదర్శన చేస్తుందనే నమ్మకాన్ని సెహ్వాగ్, కుంబ్లే, కపిల్‌దేవ్, గంగూ లీ, మంజ్రేకర్ తదితరులు వ్యక్తం చేశారు. బీసీసీఐ కార్యదర్శి జైషా కూడా గంభీర్‌పై ప్రశం సల వర్షం కురిపించారు. అనుభవం జట్టుకు ఉపయోగపడుతుందనే ఆయన వ్యక్తం పరిచారు.

## దాదాగిరి’ రియాలిటీ షో క్రేజ్

# మాములుగా లేదుగా..



**ముంబై:** సౌరవ్ గంగూలీ 2009 నుంచి ‘దాదాగిరి’ అనే రియాల్టీ షోకి హెూస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. ఇది పశ్చిమ బెంగాల్‌లోని వివిధ జిల్లాల నుంచి పోటీదారులను ఎంపిక చేసే క్విజ్ షో. ఈ క్విజ్ షోకి ఫన్నీ యాంగిల్ కూడా ఇస్తుంటారు. ఈ షో ‘కౌన్ బనేగా కరోడ్‌పతి’ వంటి సీరియస్‌నెస్, హాస్యం రెండింటినీ మిక్స్ చేసి నిర్వహిస్తున్నారు. అనేక రౌండ్లు ఉన్న ఈ షోలో ప్రైజ్ మనీ భారీగానే ఉంది. టీమిండియా మాజీ క్రికెటర్, బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ప్రస్తుతం క్రికెట్ వ్యాఖ్యాతగా కనిపిస్తున్నారు. దీనితో పాటు, అతను బెంగాలీ టీవీ ఛానెల్‌లో రియాలిటీ షోను కూడా హెూస్ట్ చేస్తున్నాడు. సౌరవ్ గంగూలీ 2009 నుంచి ఈ రియాలిటీ షోను హెూస్ట్ చేస్తున్నాడు. ప్రస్తుతం రియాలిటీ షో పదవ సీజన్‌ను హెూస్ట్ చేస్తున్నాడు. బెంగాల్ లో సినీ నటుల కంటే ఎక్కువ పాపులర్ అయి న గంగూలీ రియాల్టీ షోకి సహజంగానే టీఆర్ పీ రేటింగ్ ఎక్కువగా ఉంటుంది. అందుకు తగ్గట్టుగానే ఆ షో హెూస్ట్‌గా వ్యవహరించినందుకు గంగూలీకి భారీ జీతం వస్తుంది. ఆ షో పేరు ‘దాదాగిరి’. ఇది పశ్చిమ బెంగాల్‌లోని వివిధ జిల్లాల నుంచి పోటీదారులను ఎంపిక చేసే క్విజ్ షో. ఈ క్విజ్ షోకి ఫన్నీ యాంగిల్ కూడా ఇస్తుంటారు. ఈ షో ‘కౌన్ బనేగా కరోడ్‌పతి’ వంటి సీరియస్‌నెస్, హాస్యం రెండింటినీ మిక్స్ చేసి నిర్వహిస్తున్నారు. అనేక రౌండ్లు ఉన్న ఈ షోలో ప్రైజ్ మనీ భారీగానే ఉంది. కానీ, సౌరవ్ గంగూలీ షోలో పాల్గొన్న అందరి కంటే ఎక్కువ సంపాదిస్తున్నాడు. పదో సీజన్ కోసం సౌరవ్ గంగూలీ ఈ షో ద్వారా భారీ మొత్తంలో సంపాదిస్తున్నాడు. ఒక్కో ఎపిసోడ్‌కి గంగూలీకి రూ.50 లక్షల పారితోషికం తీసుకుంటున్నాడంట. ఈ షో ద్వారా సౌరవ్ గంగూలీ నెలకు దాదాపు నాలుగు కోట్ల రూపాయలు జేబులో వేసుకుం టున్నాడు. ఇది బెంగాల్‌లో అత్యంత ప్రజాదర ణ పొందిన షో. ఇది వారానికి రెండు రోజులు మాత్రమే ప్రసారం అవుతుంది.సౌరవ్ గంగూ లీ 2009 నుంచి ఈ షోను హెూస్ట్ చేస్తున్నా డు. అయితే మూడవ సీజన్‌లో గంగూలీ స్థానంలో బెంగాలీ బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి వచ్చారు. కానీ అతను ఆ సీజన్ తర్వాత తొలగించబడ్డాడు. గంగూలీకి తిరిగి వచ్చాడు. గంగూలీ కాస్త సీరియస్ స్వభావాన్ని కలిగి ఉన్నప్పటికీ, కంటెస్టెంట్స్‌తో లైట్ జోకులు వేస్తుంటాడు.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657